ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
గురువారం 7 నవంబరు 2024 | 5



దేవదాయ శాఖ దృష్టి




పార్వతీదేవి అమ్మవారు

కుండలేశ్వరానికి భక్తుల తాకిడి పెరగడంతో దేవదాయ శాఖ అధికారులు దృష్టి సారించారు. ఇటీవల దేవదాయ శాఖ ఉప కమిషనరు డీఎల్‌వీ రమేష్‌బాబు, ఈఈ దుర్గేష్, డీఈ ఈ శ్రీనివాస్, స్థపతి, జిల్లా దేవదాయశాఖ అధికారి సత్యనారాయణ, తనిఖీదారు రామలింగేశ్వరావు తదితరుల అధికారుల బృందం కుండలేశ్వర క్షేత్రాన్ని దర్శించింది. మాస్టర్ ప్లాన్ తయారీకి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. దేవదాయశాఖ కమిషనరుకు అధికారుల బృందం నివేదిక అందజేసి ఆలయ అభివృద్ధికి చర్యలు చేపడుతున్నట్లు సమాచారం. కుండలేశ్వరం క్షేత్రంగా మారుతున్న దశలో భక్తులకు వసతి, సౌకర్యాలు కల్పించే దిశగా ఆదాయ మార్గాలు పెంచాల్సిన అవసరం ఉంది. ఈ మేరకు ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు, అధికారులు దృష్టి సారించాల్సి ఉంది.

కుండలం (చెవిపోగు) ఆకారంలో గల శివలింగం గౌతమ మహాముని ప్రతిష్ఠించినట్లు చెబుతారు. ఈ క్షేత్ర నదీగర్భం కుండల తీర్థంగా ఖ్యాతిగాంచింది. ఇప్పటికీ నదీగర్భంలో అర్ధరాత్రి వేళ ఓంకార నాదాలు వినిపిస్తాయని చెబుతారు. కుండలేశ్వరస్వామి ఆలయ గోపురంలో 23 శివలీల విగ్రహమూర్తులు ఉండటం విశిష్టతగా చెబుతున్నారు. క్షేత్రంలో స్నాన, దాన, పూజల కారణంగా పుణ్యం కలుగుతుందని స్థల పురాణం చెబుతోంది.

కుండలేశ్వర పుణ్యక్షేత్రం పురాణాల్లో ప్రస్తావించబడింది..పవిత్ర గోదావరి నదీ తీరాన వెలసిన ఈ క్షేత్ర దర్శనానికి ఇటీవల కాలంలో వేలాదిగా తరలివస్తున్నారు. కుండలేశ్వరుడిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటున్నారు...



చాగంటి ప్రవచనంతో ఖ్యాతి

ఇంతటి మహిమాన్వితక్షేత్రం కుండలేశ్వరం కొన్నేళ్ల కిందటి వరకు స్థానికంగా మాత్రమే ప్రాచుర్యంలో ఉంది. ప్రముఖ ప్రవచన కర్త చాగంటి కోటేశ్వరరావు తన ప్రవచనంలో కుండలేశ్వర క్షేత్రం గురించి వివరించారు. తన కాశీయాత్ర సందర్భంగా ఎదురైన అనుభవాలు పంచుకున్నారు. కాశీ క్షేత్రంలో మహాపండితుడు కుండలేశ్వరక్షేత్రం దర్శించిన తర్వాత కాశీకి రావాలని సూచించినట్లు వివరించారు. తాము తరచూ కుండలేశ్వరం క్షేత్రం వచ్చి గౌతమీ నదిలో స్నానమాచరించి కుండలేశ్వరస్వామిని సేవిస్తామని పండితుడు తెలిపినట్టు చాగంటి చెప్పారు. దీంతో చాగంటి కోటేశ్వరరావు కుండలేశ్వర క్షేత్రం దర్శించుకున్నారు. తన సొంత నిధులతో భక్తుల సౌకర్యార్థం నిర్మాణాలు కూడా చేశారు. దీంతో తెలుగు రాష్ట్రాల ప్రజలతో పాటు ఇతర ప్రాంతాల భక్తులు కుండలేశ్వరం క్షేత్రంపై దృష్టి సారించారు.



కుండలేశ్వరస్వామి

వేలాదిగా భక్తుల రాక

కుండలేశ్వరం క్షేత్రానికి రెండేళ్ల క్రితం వరకు కోనసీమ ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి దర్శించుకునేవారు. కార్తీక సోమవారం, మహాశివరాత్రి పర్వదినాల్లో భక్తులు వచ్చేవారు. చాగంటి ప్రవచనంతో ఉభయ రాష్ట్రాల నుంచి భక్తులు రాక మొదలయింది. కార్తీక మాసం, మహాశివరాత్రి పర్వదినాలే కాకుండా మిగిలిన రోజుల్లో కూడా భక్తుల గణనీయంగా తరలివస్తున్నారు. టూరిస్టు బస్సులు, కార్లు ఇతర రవాణా మార్గాల ద్వారా కుండలేశ్వరానికి భక్తులు క్యూ కడుతున్నారు. పర్వదినాల్లో వేల సంఖ్యలోను, మిగిలిన రోజుల్లో వందల సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుంటున్నారు. దీంతో కొంత మేర ఆలయంలో అభివృద్ధి పనులు చేశారు. క్యూలైన్లు ఏర్పాటు చేశారు. కార్తీక మాసంలో అన్నదానం ఏర్పాటు చేశారు.

మహిమాన్వితం కుండలేశ్వర క్షేత్రం
వృద్ధ గౌతమి నదీతీరాన వెలసిన పవిత్ర ఆలయం
ఇటీవల కాలంలో పెరిగిన రద్దీ

● కాట్రేనికోన(ఆంధ్రజ్యోతి):

అదిగో..కుండలేశ్వరం



గోదావరి తీరాన ఆధ్యాత్మిక వైభవం

పచ్చని కోనసీమ ప్రాంతంలో కాట్రేనికోన మండలంలో వృద్ధ గౌతమీ నదీతీరాన కుండలేశ్వరస్వామి వెలసిన మహిమాన్విత క్షేత్రం కుండలేశ్వరం. 15వ శతాబ్దంలో మహాకవి శ్రీనాథుడు తన భీమఖండము, కాశీ ఖండములో కుండలేశ్వరక్షేత్రం ప్రాశస్త్యం గురించి వివరించారు. విరూపాక్షుండు కుండలేశ్వరుండు అని కాశి ఖండములోను, కోటిపల్లీశుకోమలాంధ్రములకు మ్రొక్కికుండలాముఖతీర్థంబు గురించి గౌతమి, గంగ లవణాబ్ధి గౌగలించె అని భీమఖండంలోను వర్ణించారు. బ్రహ్మాండ పురాణంలో వ్యాస మహర్షి ఈ క్షేత్రం గురించి వివరించారు. శంకరాచార్యకృతమైన చంద్రశేఖర అష్టకములో కుండలేశ్వరస్వామిని మార్కండేయుడు ధ్యానించునట్లు శ్లోకములు ద్వారా తెలుస్తుంది.



విద్యుత్ వెలుగుల్లో కుండలేశ్వర ఆలయం

పన్నుల వసూళ్లు వేగవంతమవ్వాలి

మున్సిపల్ ఆర్డీ నాగనరసింహారావు



సమావేశం నిర్వహిస్తున్న ఆర్డీ నాగనరసింహారావు

అమలాపురం టౌన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): లక్ష్యాలకు అనుగుణంగా పన్నుల వసూళ్లు వేగవంతం చేయాలని రాజమహేంద్రవరం మున్సిపల్ రీజనల్ డైరెక్టర్ సీహెచ్ నాగనరసింహారావు సూచించారు. పన్నుల వసూళ్లలో జిల్లాలోని పురపాలక సంఘాలు వెనుకబడి ఉండడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బుధవారం అమలాపురం శుభగృహాలో జిల్లాలోని పురపాలక సంఘాలు, నగర పంచాయతీలతో పాటు నిడదవోలు, కొవ్వూరు పురపాలక సంఘాల కమిషనర్లు, ఇతర శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. పన్నుల వసూళ్లలో అమలాపురం పురపాలక సంఘం పూర్తిగా వెనుకబడి ఉండడాన్ని ఆయన ప్రశ్నించారు. దాంతో ఆర్వో జయలక్ష్మి స్పందిస్తూ ఇటీవల తాను బదిలీపై వచ్చానని, పన్నుల వసూళ్లను వేగవంతం చేస్తానని చెప్పారు. ప్రధానంగా తాగునీటి సరఫరా, పారిశుధ్య సేవలపై దృష్టి సారించాలని సూచించారు. వీటిపై ఎటువంటి ఫిర్యాదులు రాకుండా ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ముందుకు సాగాలన్నారు. పన్నుల వసూలు సక్రమంగా జరిగితేనే పట్టణాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. టౌన్ ప్లానింగ్, పన్నులకు సంబంధించి చెల్లింపుల విషయంలో పలువురు కోర్టుకు వెళ్లిన విషయాలను పురపాలక సంఘాల వారీగా సమీక్షించి వాటిని సత్వరం పరిష్కరించాలన్నారు. ఇంజనీరింగ్ విభాగంలో చేపడుతున్న పనులు, బిల్లుల చెల్లింపుల్లో జాప్యం, బిల్లుల బకాయిలు తదితర అంశాలను ప్రస్తావించారు. మార్చి నెలాఖరు నాటికి నూరు శాతం పన్నుల వసూళ్లు లక్ష్యంగా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని ఆర్డీ నరసింహారావు సూచించారు. అమలాపురం, రామచంద్రపురం, మండపేట, నిడదవోలు పురపాలక సంఘాల కమిషనర్లు కేవీఆర్ఆర్ రాజు, వి.అయ్యప్పనాయుడు, పీవీ రంగారావు, సత్యనారాయణ, టీఎల్‌వీఎస్ కృష్ణవేణితో పాటు వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

డీఎస్సీ ఉచిత శిక్షణకు 10న ఎంపిక పరీక్ష

జిల్లా సోషల్ వెల్ఫేర్ అధికారి జ్యోతిలక్ష్మీదేవి

అమలాపురం టౌన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రతిభావంతులైన పేద ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో ఉచిత డీఎస్సీ శిక్షణ ఇచ్చేందుకు చర్యలు చేపట్టామని జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారిణి పి.జ్యోతిలక్ష్మీదేవి తెలిపారు. ప్రతిభావంతులైన ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు డీఎస్సీలో ఉత్తమ ఫలితాలు పొందేందుకు ప్రభుత్వం నిష్ణాతులైన అధ్యాపకులతో శిక్షణ ఇస్తుందన్నారు. రెసిడెన్షియల్ ప్రాతిపదికన ఇచ్చే శిక్షణకు సంబంధించి అభ్యర్థుల ఎంపికకు ఈ నెల 10న పరీక్ష నిర్వహించనున్నట్లు చెప్పారు. టెట్ ఉత్తీర్ణులై ఉంటే వారికి స్క్రీనింగ్ టెస్ట్ రాయడానికి, దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు వెబ్‌సైట్‌లో తమ హాల్ టిక్కెట్‌ను డౌన్‌లోడ్ చేసుకుని 10వ తేదీన పరీక్షా కేంద్రానికి 30 నిమిషాల ముందుగా కేటాయించిన కేంద్రానికి చేరుకోవాలన్నారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్ష జరుగుతుందని జ్యోతిలక్ష్మీదేవి తెలిపారు.



మండపేట మండలంలో వరి కోతలు జరుగుతున్న దృశ్యం

కోతలు.. కష్టాలు..

కూలీలు దొరక్క..వాతావరణం అనుకూలించక..

మండపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లో ఖరీఫ్ వరి కోతలు ప్రారంభమయ్యాయి. వరి కోతలకు సంబంధించి కూలీల కొరత, పంట దిగుబడులు తగ్గుదల, సహకరించని వాతావరణం అన్నదాతలను కలవరపెడుతున్నాయి. కూటమి ప్రభుత్వం రైతులను ఆదుకునేందుకు వ్యవసాయానికి సంబంధించి అనేక మార్పులు చేసింది. వాటి ద్వారా కొంతమేర అన్నదాతలకు ఊరట కలగనుంది. జిల్లాలో 1.53 లక్షల ఎకరాల్లో వరి సాగవుతోంది. ప్రస్తుతం రామచంద్రపురం రెవెన్యూ డివిజన్ పరిధిలో గల రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాలలో ఖరీఫ్ వరి కోతలు ప్రారంభమయ్యాయి. ఇప్పటికే ఇక్కడ 20 శాతంపైబడి వరి కోతలు జరిగాయని వ్యవసాయ శాఖాధికారులు చెబుతున్నారు. ఈనెల 15 నుంచి వరి కోతలు జిల్లా వ్యాప్తంగా ముమ్మరంగా ఊపందుకోనున్నాయని అధికారులు వెల్లడిస్తున్నారు. ముఖ్యంగా రైతుల ఖరీఫ్ పంట ధాన్యం దిగుబడి ఎకరాకు 40 బస్తాల వరకు వస్తుందని ఆశించినప్పటికి వాతావరణం అనుకూలించకపోవటం, తెగుళ్ల కారణంగా ఎకరాకు 25 నుంచి 30 బస్తాల మధ్య వస్తోంది. ఎకరాకు రూ.30 వేలు పైబడి పెట్టుబడి అవటంతో వ్యవసాయం తలకు మించిన భారంగా తయారైందని రైతులు లబోదిబోమంటున్నారు. మరోపక్క ప్రకృతి విపత్తులు , కూలీల కొరత, పెట్టుబడులు పెరిగిపోవటం తదితర కారణాలు వల్ల కూడా వ్యవసాయం కష్టతరంగా మారిందని రైతులు వాపోతున్నారు.



370 రైతు సేవా కేంద్రాలు

జిల్లాలో ధాన్యం కొనుగోలుకు సంబంధించి 370 రైతు సేవా కేంద్రాల ద్వారా ప్రభుత్వం ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ఏర్పాట్లు చేసిందని అధికారులు వెల్లడించారు. వ్యవసాయశాఖ ద్వారా జిల్లాలో ధాన్యం దిగుబడి 3.62 లక్షల మెట్రిక్ టన్నుల వస్తుందని అంచనా వేశారు. అందులో 2.30 లక్షలు మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. సాధారణ రకం క్వింటా రూ.2300 (75కిలోలు రూ.1725) గ్రేడ్ ఎ రకం రూ.2320 (75 కిలోలు రూ.1740)వంతున మద్దతు ధర నిర్ణయించారు. ఇక ధాన్యం తేమ విషయంలో రైతు సేవా కేంద్రాల వద్ద మిల్లర్లు వద్ద ఒకే కంపెనీకి చెందిన యంత్రాలను ఏర్పాటు చేశారు. రైతు సేవా కేంద్రం సిబ్బంది నేరుగా రైతుల వద్దకు వెళ్లి కళ్లాల్లో ధాన్యం తేమ శాతం పరిశీలించి కేంద్రాల ద్వారానే ధాన్యంను కొనుగోలు చేయాలి.

కూటమి చేదోడు

కూటమి ప్రభుత్వం రైతులకు చేదోడుగా నిలుస్తోంది. పంటకు గిట్టుబాటు ధర కల్పించటం ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యాన్ని రైతుల నుంచి కొనుగోలు చేసేలా కేంద్రాలను ఏర్పాటు చేసి నేరుగా రైతుల ఖాతాకు ధాన్యం నగదు అందేలా చేస్తుంది. ఈ మేరకు రైతులకు వ్యవసాయశాఖ ద్వారా అవగాహన కల్పిస్తోంది. రైతులు స్వర్ణ 1318, ఎంటీయూ 7029 రకాలను 95 శాతం మేర సాగు చేశారు. ఈ పంట 150 రోజులు వ్యవధిలో చేతికి వస్తుంది. వరికోతకు కూలీలు రేట్లు కూడా పెంచేశారు. ఇక చేసేదేమిలేక రైతులు వరికోత యంత్రాల ద్వారానే వరికోతలు చేయించుకుంటున్నారు. మిషన్‌కు గంటకు రూ.2800 వరకు తీసుకుంటున్నారు. వరి దిగుబడి మాత్రం ఎకరాకు 25 నుంచి 30 బస్తాల మేర వస్తుందని రైతులు చెబుతున్నారు. మరోవైపు వాతావరణంలో వస్తున్న మార్పులు రైతులను కలవరపెడుతున్నాయి. వాతవరణం తరచూ మార్పులు చెందుతుండడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. పంట చేతికందేవరకు ప్రకృతి సహకరించాలని దేవుడిని కోరుకుంటున్నారు.

48 గంటల్లో నగదు జమ



ధాన్యం కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్

మండపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సార్వా సీజన్‌లో రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం జిల్లా వ్యాప్తంగా 370 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ చెప్పారు. జిల్లాలోని మండపేట మండలం ద్వారపూడి పంచాయతీ పరిధిలో గల జెడ్.మేడపాడు సహకార సంఘంలో బుధవారం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ మహేష్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు ధాన్యం విక్రయించిన 48 గంటల వ్యవధిలో ధాన్యం నగదు రైతుల బ్యాంకు ఖాతాలకు జమ చేయనున్నట్లు చెప్పారు. ధాన్యాన్ని దళారులకు ఇచ్చి మోసపోవద్దని రైతు సేవా కేంద్రాల ద్వారా ప్రభుత్వానికి ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని కలెక్టర్ రైతులకు సూచించారు. రైతులకు రైస్ మిల్లర్లు బ్యాంకు గ్యారంటీ ఇచ్చే విధంగా చర్యలు తీసుకున్నామన్నారు. రైతు వద్ద నుంచి ధాన్యం కొనుగోలు మొదలుకుని రవాణా, హమాలీ చార్జీలను కూడా ప్రభుత్వమే అందిస్తుందని చెప్పారు. ధాన్యం కొనుగోలు సమయంలో ధాన్యం విక్రయించే రైతు మొబైల్‌కు సమాచారం అందుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, రామచంద్రపురం ఆర్డీవో డి.అఖిల, జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు, సివిల్ సప్లయి డీఎం బాలసరస్వతి, ఆర్‌టీవో డి.శ్రీనివాసరావు, డీఎస్‌వో ఉదయభాస్కర్, జిల్లా మార్కెటింగ్ శాఖ ఏడీ కె.విశాలాక్షి, జిల్లా సహకార అధికారి మురళీకృష్ణ, మండపేట తహసీల్దార్ తేజేశ్వరరావు, ఈవోపీఆర్డీ దాసరి శ్రీనివాసరావు, ద్వారపూడి కార్యదర్శి ఆకుల వీవీ రమణ, అమర్‌నాథ్‌చౌదరి, వ్యవసాయాధికారి యేసుబాబు, మండల టీడీపీ అధ్యక్షుడు యరగతపు బాబ్జి, జనసేన నాయకుడు చింతా దొరబాబు, బీజేపీ నాయకుడు మురళీకృష్ణ, రైస్‌మిల్లర్స్ తదితరులు పాల్గొన్నారు.

'అపార్' లక్ష్యాన్ని నూరు శాతం పూర్తిచేయాలి

జిల్లా విద్యాశాఖాధికారి సలీంబాషా

అమలాపురం రూరల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): అపార్ నమోదును వేగవంతం చేసి నూరుశాతం లక్ష్యాన్ని పూర్తి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషా సూచించారు. అపార్ నమోదులో ప్రైవేటు విద్యా సంస్థలు వెనుకబడి ఉండడంతో మండల విద్యాశాఖాధికారులతో పాటు ఆయా సంస్థల యాజమాన్యాలతో బుధవారం సమనస ఢిల్లీ పబ్లిక్ స్కూలులో సమావేశం నిర్వహించారు. పూర్వ ప్రాథమిక విద్య నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యార్థుల అపార్ నమోదుకు సంబంధించి ఎదురవుతున్న ఇబ్బందులను ఆయన ఆరా తీశారు. ప్రధానంగా పాఠశాలల రికార్డుల్లోను, ఆధార్, యూడైస్‌లో విద్యార్థులకు సంబంధించి పేర్లు కొద్దిపాటి తేడాలు ఉండడంతో అపార్ ఐడీ నమోదులో జాప్యం జరుగుతుందని గుర్తించారు. సాంకేతిక సమస్యలను అధిగమించేందుకు స్పెషల్ డ్రైవ్‌లు పాఠశాలల వారీగా నిర్వహించనున్నట్టు ఆయన తెలిపారు. ప్రతీ విద్యార్థికి 12 అంకెలతో కూడిన ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అక్కౌంట్ రిజిస్ట్రీ (అపార్) జనరేట్ అవుతుందని తెలిపారు. విద్యార్థులకు సంబంధించిన పూర్తి సమాచారం అపార్‌లో పొందుపరుస్తారన్నారు. జిల్లాకు సంబంధించి ఇప్పటి వరకు 62.82 శాతం అపార్ ఐడీ నమోదు పూర్తి అయిందన్నారు. ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఆధార్‌లో ఇబ్బందులను పరిష్కరించేందుకు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదేశాల మేరకు 63 బృందాలను మండలాల వారీగా పంపించామన్నారు. అపార్ ఐడీ నమోదులో ముందున్న ముమ్మిడివరం ఎండీవో బొజ్జా రమణశ్రీని ప్రత్యేకంగా అభినందించారు. ఉప విద్యాశాఖాధికారి గుబ్బల సూర్యప్రకాశం అధ్యక్షతన జరిగిన సమావేశంలో డీసీఈబీ కార్యదర్శి బి.హనుమంతరావు సమగ్ర శిక్ష సీఎంవో బొరుసు వీవీ సుబ్రహ్మణ్యం, ఏఎల్‌ఎస్‌సీ డి.రమేష్‌బాబు, ఏపీవోలు ఎంపీకే భీమారావు, బి.ఆదినారాయణ, ఏఎస్వో దొమ్మేటి తాతారావు, కరస్పాండెంట్‌లు మంగళంపల్లి అంజిబాబు, నంద్యాల మనువిహార్ తదితరులు పాల్గొన్నారు.



చంద్రబాబుతో మంత్రి సుభాష్ భేటీ

రామచంద్రపురం(ద్రాక్షారామ),నవంబరు 6: సీఎం చంద్రబాబునాయుడును కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ బుధవారం కలిశారు. మంత్రివర్గ సమావేశం అనంతరం మంత్రి సుభాష్ అమరావతిలో చంద్రబాబును కలిసి పలు అంశాలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. చివరి రెండు రోజుల్లో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓట్ల నమోదు శాతాన్ని పరుగులుపెట్టించిన విధానంపై మంత్రిని చంద్రబాబు అభినందించారు. ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరంను అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామని చంద్రబాబుకు హామీ ఇచ్చినట్లు మంత్రి సుభాష్ తెలిపారు.



డాక్టర్ బి.జయరామ్‌జీబాబు

నేడు ప్రపంచ శిశు సంరక్షణ దినోత్సవం

తల్లిపాలే.. అసలైన వ్యాక్సిన్!



అమలాపురం ఏరియా ఆసుపత్రిలో ఎన్బీఎస్‌యూ యూనిట్‌లో అత్యవసర వైద్యసేవలు.. వైద్య సేవల కోసం వచ్చిన శిశువు

అమలాపురం టౌన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): తల్లీబిడ్డల ఆరోగ్య రక్షణ కోసం ఎన్నో వైద్యసేవలు అందుబాటులోకి వచ్చాయి. అలాగే పుట్టిన బిడ్డకు ఏ అత్యవసర సేవలు అవసరమైనా అందించేందుకు అమలాపురం ఏరియా ఆసుపత్రిలో ప్రత్యేక వైద్య విభాగం ఉంది. న్యూబోర్న్ స్టెబిలేషన్ యూనిట్ (ఎన్బీఎస్‌యూ)లో అత్యాధునిక వైద్య పరికరాలు, సేవలు అందించేందుకు వైద్య నిపుణులు, సిబ్బంది అందుబాటులో ఉన్నారు. ఒక్క అమలాపురం ప్రాంతానికి చెందినవారే కాకుండా రాజోలు, పి.గన్నవరం, అల్లవరం వంటి ప్రాంతాల ప్రభుత్వ వైద్యశాలల నుంచి సైతం శిశువులను తీసుకువస్తున్నారు. ఎన్బీఎస్‌యూలో అత్యాధునిక వైద్య సేవలను అందుబాటులోకి తీసుకువచ్చారు. ప్రధానంగా కామెర్లతో బాధపడే శిశువుల కోసం ఫొటోథెరపీ ఉంది. ఫొటోథెరపీ శిశువుకు మందులా పనిచేసి ఆ వ్యాధిని తగ్గిస్తుంది. ఇక ఆక్సిజన్ అందక ఇబ్బంది పడే శిశువుల కోసం సిపాప్ యంత్ర పరికరం అందుబాటులో ఉంచారు. ఇన్ఫెక్షన్లు, ఆయాసం వంటి సమస్యలతో బాధపడే చిన్నారులకు వార్మర్స్ ఫెసిలిటీ చేసే వైద్య పరికరాలున్నాయి. అత్యల్పంగా బరువు ఉన్న శిశువుల కోసం ప్రత్యేక వైద్య సేవలు అందిస్తున్నారు. కిలో, కిలోన్నర బరువు ఉన్న శిశువుల ఆరోగ్య పరిస్థితిని గుర్తించి మెరుగైన వైద్య సేవలకు మాత్రమే స్పెషల్ ఎన్బీఎస్‌యూ ఉన్న కాకినాడ జనరల్ ఆసుపత్రికి సిఫార్సు చేస్తారు. అటువంటి కేసులు చాలా తక్కువ. ఏడాది కాలంలో ఒక్క శిశు మరణం కూడా సంభవించలేదని ఎన్బీఎస్‌యూ విభాగ వైద్యులు డాక్టర్ బి.జయరామ్‌జీబాబు తెలిపారు. ఎన్బీఎస్‌యూలో నెలకు 60 నుంచి 70 మంది శిశువులకు ప్రత్యేక వైద్య సేవలు అందిస్తున్నామని, కొద్దిపాటి అనారోగ్య సమస్యలు ఉన్న వారికి కూడా ఒకట్రెండు రోజులు వైద్యసేవలు అందించడం వల్ల నెలకు అడ్మిషన్ల సంఖ్య 120కు చేరిందన్నారు.

ఆరోగ్యకరమైన ఎదుగుదలకు తల్లీబిడ్డల బంధమే ప్రధానం

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) :అప్పుడే పుట్టిన పిల్లల విషయంలో తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సి ఉంటుంది. పుట్టిన గంటలోనే శిశువుకు ముర్రుపాలు తాగించాలి. బిడ్డను వెచ్చటి శుభ్రమైన దుస్తులతో కప్పిఉంచి తల్లికి దగ్గరగా ఉంచాలి. బిడ్డ నెలలు నిండకుండా పుడితే బిడ్డను ఇంక్యుబేటర్‌లో ఉంచాలి. ఆరోగ్య పరిస్థితిని గమనించాలి. సరైన బరువుతో బిడ్డ ఉందా లేదా చూడాలి. పిల్లలకు పుట్టిన వెంటనే వేయాల్సిన పోలియో మందులు, సూదిమందులు వేయమని డాక్టర్‌ను అడగాలి. సాధారణంగా అప్పుడే పుట్టిన పిల్లలకు ఆసుపత్రుల్లో ఒక ప్రత్యేకమైన కార్డు తీసుకొస్తారు. ఆ కార్డులో బిడ్డకు ఏ సమయంలో ఏ టీకా వేయాలి అనేది ఉంటుంది. ఈ టీకాలు బిడ్డలో రోగ నిరోధక శక్తిని పెంచుతాయి. అలాగే, విటమిన్ కే ఇచ్చారా? లేదా అనేది తెలుసుకోవాలి. శిశువును తల్లి దగ్గరే పడుకోబెట్టి తల్లి స్పర్శ తగిలేలా ఉంచితే సరైన టెంపరేచర్ మెయింటైన్ అవుతుంది. చాలామంది తల్లులు, కుటుంబీకులు బిడ్డలకు పాలు తాగించడం, డైపర్లు మార్చడంపైనే దృష్టి ఉంచుతారు. కానీ ఇతర విషయాలను గమనించాలి. వినికిడి శక్తి బాగానే ఉందని తెలుసుకోవాలి. కంటిచూపు వస్తువులు, రంగులపైనా ఉందా లేదా అనేది గమనించాలి. ఆరోగ్యకరమైన ఎదుగుదల ద్వారానే తల్లి, బిడ్డ బంధం బలపడుతుంది. శిశువు బోర్లా పడడం, వెల్లకిలా పడుకోవడం లాంటివి వాళ్లకు వాళ్లే చేయాలి తప్ప బలవంతంగా మార్చకూడదు. పిల్లల ఏడుపు మొదటి ఆరు ఆరువారాల్లో ఎక్కువగా ఉంటుంది. తర్వాత తగ్గుతుంది. ఏదైనా అసాధారణమైన మార్పు కానీ, లక్షణం కానీ కనిపిస్తే డాక్టర్ దృష్టికి తీసుకెళ్లాలి. అలాగే బరువు సరిగా పెరుగుతున్నారా లేదా అనేది గమనించాలి. దీన్ని త్వరగా తెలుసుకోవాలి. ఆకలిని బట్టి ఆహారం ఇవ్వాలి. ఇదేం తప్పుకాదు. ప్రతి బేబీకి 6 నెలల వరకూ తల్లిపాలు మాత్రమే ఇవ్వాలి. నీళ్లు, ఇంకేమీ ఇవ్వకూడదు. ఆవుపాలు, గేదెపాలు ఇవ్వకూడదు. మెడికల్లీ ఇండికేటెడ్ అయితేనే ప్రత్యామ్నాయ ఆహారాన్ని అందించాలి. ఆరు నెలల తర్వాత శిశువుకు తయారుచేసిన ఆహారం పెట్టాలి.

● తల్లికి అనేక ప్రశ్నలు..

అప్పుడే పుట్టిన బేబీకి అవసరాలు తక్కువగా ఉంటాయి. బేబీని తల్లి నుంచి వేరు చేసిన తర్వాత ఆ శిశువు తన టెంపరేచర్ తాను మెయింటెన్ చేసుకోవాల్సి ఉంటుంది. ఈ క్రమంలో నెల రోజులపాటు జాగ్రత్తలు తీసుకోవాలి. చలికాలంలో అరచేతులు, అరికాళ్లలో వేడి కోల్పోతారు. దీనికోసం మంచిగా దుస్తులు కప్పి ఉంచాలి. శిశువులో ఏ పార్టు అయినా వెచ్చగా ఉండాలి. టెంపరేచర్ సరిగా మెయింటైన్ చేయలేకపోతే షుగర్‌లెవెల్స్ పడిపోతాయి. ఇన్‌ఫెక్షన్స్ వస్తాయి. బ్రెస్ట్‌ఫీడ్ ముఖ్యం. బిడ్డకు ఫస్ట్ వ్యాక్సిన్ తల్లిపాలే అన్న సంగతి గుర్తుంచుకోవాలి.

ఆందోళన కలిగిస్తున్న మరణాల రేటు

జీజీహెచ్(కాకినాడ), నవంబరు 6(ఆంధ్రజ్యోతి): చంటిబిడ్డకు దివ్య ఔషధం తల్లి పాలు. అంటే బిడ్డతోపాటు తల్లి ఆరోగ్యమూ ముఖ్యమే. కానీ తల్లులు పోషకాహారం తీసుకోకపోవడం తదితర కారణాలతో శిశుమరణాలు ఎక్కువగా సంభవిస్తున్నాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో గతేడాది 26,732 మంది శిశు జననాలుండగా, 284 మంది శిశువులు మరణించారు. దీని ప్రకారం.. వెయ్యిమందిలో పది మంది మృత్యువాతపడ్డారు. దీంతో శిశు మరణాల రేటు 1.06 శాతంగా నిర్ధారించారు. ఈ ఏడాది ఇప్పటివరకు 16,166 శిశు జననాలకుగాను 179 మంది మరణించారు. దీని ప్రకారం.. వెయ్యిమందిలో 11 మంది మృతి చెందారు. శిశు మరణాల రేటు 1.17 శాతంగా నిర్ధారించారు. ఇది ఆందోళన కలిగించే విషయం. తల్లి హైరిస్క్ ప్రెగ్నెన్సీ, చిన్న వయస్సులో పెళ్లిచేయడం, మేనరికం, పోషకాహార లోపం వంటి కారణాలతో శిశు మరణాలతోపాటు మాతృమరణాలూ సంభవిస్తున్నాయి. అయితే కాకినాడ జీజీహెచ్‌లోని పిడియాట్రిక్స్ (చిన్న పిల్లల) విభాగం రాష్ట్రంలోని 11 బోధనాస్పత్రులకంటే అగ్రగామిగా నిలిచింది. ఇక్కడ (ఎన్ఐసీయూ) నియోనేటల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (నవజాత శిశు సంరక్షణ కేంద్రం) చంటి పిల్లలకు పునర్జన్మను ప్రసాదించేదిగా ఉంది. ఇక్కడ నిష్ణాతులైన వైద్యులు 24 గంటలపాటు సేవలందిస్తున్నారు.

ఎంతోమంది శిశువులకు పునర్జన్మ



జీజీహెచ్ పిడియాట్రిక్స్ విభాగంలో అప్పుడే పుట్టిన శిశువుల నుంచి 12 ఏళ్ల వయస్సు కలిగిన పిల్లల వరకు వైద్యం అందిస్తున్నాం. ముఖ్యంగా ఈ విభాగంలో ఎన్ఐసీయూ ఓ ప్రత్యేకతను సంతరించుకుంది. ఇక్కడ తక్కువ బరువు ఉన్న శిశువులు, నెలలు నిండకుండా పుట్టిన శిశువులు, పచ్చకామెర్లతో పుట్టిన శిశువులకు ప్రత్యేక వెంటిలేటర్‌లు, వార్మర్ల సహాయంతో ప్రత్యేక చికిత్స అందిస్తున్నాం. అనంతరం పీఐసీయూలో ఉంచి ప్రత్యేక వైద్యచికిత్స అందిస్తున్నాం. ఇక్కడ అత్యాధునిక వైద్య సదుపాయాలు, ఖరీదైన మందులు కూడా ఇస్తున్నాం. తద్వారా చిన్నారులు మెరుగైన వైద్యచికిత్స పొంది ఆరోగ్యవంతులవుతున్నారు. ఇక్కడ పిడియాట్రిషియన్లు, నియోనటాలజిస్టులు, పిడియాట్రిక్ నర్సులు అందుబాటులో ఉన్నారు.

- డాక్టర్ డి.మాణిక్యాంబ, హెచ్‌వోడీ, కాకినాడ జీజీహెచ్

రాజమహేంద్రవరం జీజీహెచ్‌లో సేవలివీ..



శిశువుల సంరక్షణ కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి (జీజీహెచ్)లో ప్రత్యేక ఏర్పాట్లు ఉన్నాయి. ఎంసీహెచ్ బ్లాకులోని పీడియాట్రిక్స్ విభాగంలోని వైద్యబృందం అప్పుడే పుట్టిన శిశువులతోపాటు, చిన్నారులకు వైద్యసేవలందిస్తున్నారు. నవజాత శిశువుల కోసం లెవెల్ -2 కేర్‌గా పిలిచే అత్యాధునిక వైద్య పరికరాలతో కూడిన ఎస్ఎన్‌సీయూ బ్లాకు అందుబాటులో ఉంది. తలసేమియా, హీమోఫిలియా వంటి కేసుల్లోనూ ఇక్కడ వైద్య సేవలు పూర్తి ఉచితంగా లభిస్తున్నాయి. జీజీహెచ్‌లో పిల్లల ఓపీ ప్రతిరోజూ సగటున 70 వరకూ ఉంటోంది. ఇన్‌పేషెంట్లు అడ్మిషన్లు 10 వరకూ జరుగుతున్నాయి. దీంతోపాటు డైస్ (డీఈఐసీ) కేంద్రం ద్వారా ముందస్తుగానే చిన్నారుల్లో వినికిడి, ఇతర వైకల్యాలు, శారీరక లోపాల గుర్తింపు ప్రక్రియ సైతం చేపడుతున్నారు. రాజమహేంద్రవరం జీజీహెచ్ పిడియాట్రిక్స్ హెచ్‌వోడీ డాక్టర్ మోహన్‌చంద్ర మాట్లాడుతూ శిశువు ఆరోగ్యకరమైన ఎదుగుదలతోనే తల్లీ, బిడ్డ బంధం బలపడుతుందన్నారు. పుట్టినప్పటి నుంచి ఆరు నెలల వయస్సు వచ్చే వరకూ శిశువుకు తల్లిపాలు అత్యంత శ్రేయస్కరమని చెప్పారు. అనారోగ్య లక్షణాలు కనిపిస్తే వెంటనే పిల్లల డాక్టర్‌ను సంప్రదించాలని, రాజమహేంద్రవరం జీజీహెచ్‌లో మెరుగైన వైద్యసేవలు అందుబాటులో ఉన్నందున ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ మోహనచంద్ర పేర్కొన్నారు.

కాకినాడలో శిశుగృహ ద్వారా పిల్లల సంరక్షణ


కె.ప్రవీణ, మహిళా, శిశుసంక్షేమ శాఖ అధికారిణి, కాకినాడ

కార్పొరేషన్(కాకినాడ), నవంబరు 6(ఆంధ్రజ్యోతి): జిల్లా మహిళా, శిశుసంక్షేమశాఖ సాధికారిక అధికారుల వారి సంరక్షణలో శిశుగృహ నడుస్తోంది. కాకినాడ అశోక్‌నగర్‌లో శిశుగృహ ఉంది. అవాంఛనీయ గర్భం దాల్చి పిల్లలు వద్దు అనుకున్నవారు, శిశువును పెంచి పోషించే స్థోమత లేనివారు, ఎవరికైనా దత్తత ఇచ్చేయాలని అనుకున్నవారు, అనాథ పిల్లలు, నిరాదరణకు గురైన పిల్లలు, రైల్వే స్టేషన్, బస్‌స్టేషన్, పార్కు, ఆసుపత్రులు, చెత్తకుప్పల్లో వదిలేసిన శిశువులు, తప్పిపోయిన పిల్లలను శిశుగృహలో సంరక్షిస్తూ వారి యోగక్షేమాలు చూస్తుంటారు. ఎవరైనా అనధికార దత్తత తీసుకున్నా ఆ సమాచారాన్ని వెంటనే చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, పోలీసు 100 లేదా సంబంధిత అధికారులకు సమాచారం అందించి వారిని రక్షించి బాలల సంక్షేమ సమితి ముందు ప్రవేశపెట్టి బాలల సంక్షేమ సమితి ఆదేశాలతో శిశుగృహ, బాలల రక్షితగృహాల్లో సంరక్షణ కల్పించి ప్రత్యేక దత్తత వనరుల సంస్థ(కారా), న్యూఢిల్లీ వారి నిబంధనల ప్రకారం చట్టపరంగా దత్తత ఇస్తారు.2015 నుంచి ఇప్పటివరకు శిశుగృహ ద్వారా సంరక్షించిన పిల్లలను విదేశీ దత్తతకు-ఆడపిల్లలు 50మంది, మగపిల్లలు 23మంది. స్వదేశీ దత్తతకు ఆడపిల్లలు 10మంది,మగపిల్లలు ముగ్గురిని దత్తత ఇచ్చామని జిల్లా మహిళా, శిశు సంక్షేమశాఖ అధికారిణి కె.ప్రవీణ తెలిపారు.

మన్యంలో రాలుతున్న పసిమొగ్గలు.. 7 నెలల్లో 49 మంది మృతి

మరో 46 మందికి గుండె జబ్బులు
బలహీనంగా జన్మించినవారు 113 మంది
మరణాల నిష్పత్తి 3.41 శాతం


చింతూరులో మృతి చెందిన పసిబిడ్డ (ఫైల్)

చింతూరు, నవంబరు6(ఆంధ్రజ్యోతి): ఆరోగ్య కార్యకర్తల నుంచి వైద్యుల వరకు నిత్య పర్యవేక్షణతో కూడిన సేవల్లో నిమగ్నమవుతున్నామని చెప్పుకుంటున్నప్పటికీ మన్యంలో శిశు మరణాలను మాత్రం నిలువరించలేకపోతున్నారు. చింతూరు డివిజనులో ఏప్రిల్ నుంచి అక్టోబరు వరకు 1435 మంది తల్లులు తమ బిడ్డలకు జన్మనిచ్చారు. కాగా వీరిలో 49 మంది చిన్నారులు మృత్యువాతపడ్డారు. అంటే 3.41 శాతం మరణాల రేటు నమోదైనట్టు అధికారిక గణాంకాలే స్పష్టంచేస్తున్నాయి. నమోదుకాని మరణాలు కూడా ఉండి ఉంటాయన్న అభిప్రాయాలు లేకపోలేదు. ఇక ఒక్క చింతూరు ఏరియా ఆసుపత్రిలోనే జనవరి నుంచి అక్టోబరు వరకు 689 మంది జన్మించారు. వీరిలో 46 మంది చిన్నారులకు గుండె జబ్బులు ఉన్నట్టు వైద్యులు గుర్తించారు. మరో 113 మంది చిన్నారులు సాధారణ బరువు రెండున్నర కేజీలు కాగా అంతకంటే తక్కువ బరువుతో పుట్టారు. ఇందుకు ప్రధాన కారణం పౌష్టికాహారలోపమేనని చెబుతున్నారు. చింతూరు డివిజనులో 10 ప్రాథమిక వైద్యశాలలు, ఒక ఏరియా ఆసుపత్రితోపాటు ఒక కమ్యూనిటీ హెల్త్ సెంటరు, ప్రత్యేక నవజాతి నవజాతి శిశు చికిత్స కేంద్రం కూడా ఉంది. మరోవైపు 266 ప్రధాన అంగన్వాడీ, 166 మిని అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయి. చింతూరులోని ప్రత్యేక నవజాతి శిశువైద్య శిబిరం ద్వారా ఈ ఏడాది జనవరి నుంచి అక్టోబరు వరకు 0 నుంచి 30 రోజుల వయస్సు ఉన్న 334 మందికి చిన్నారులకు చికిత్స అందించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇదిలా ఉండగా.. ఒక మహిళ గర్భం దాల్చిన నాటి నుంచి మొదలు బిడ్డకు 3 సంవత్సరాలు వయస్సు వచ్చేంత వరకు అంగన్వాడీల ద్వారా పౌష్టికాహారం అందిస్తున్నారు. వీటిలో బాలసంజీవని కిట్, టేక్ హోం రేషను వరకు ఉన్నాయి. ఇక బిడ్డకు 3 సంవత్సరాల వయస్సు దాటిన నుంచి అంగన్వాడీ కేంద్రంలోనే ఆయా చిన్నారులకు ప్రతిరోజు గుడ్డు, పాలుతోపాటు మధ్యాహ్న భోజన వసతి కల్పిస్తున్నారు. ఇన్ని వసతులు కల్పిస్తున్నా శిశుమరణాలు మాత్రం ఆగడంలేదు. గుండె జబ్బులు, రక్తహీనత, శ్వాసకోస ఇబ్బందులు బిడ్డల్ని పట్టి పీడిస్తున్నాయి.



నేడు జాతీయ కేన్సర్ అవగాహన దినం

కేన్సర్.. కబళిస్తోంది!

● పేద, మధ్య తరగతి వారి జీవితాలు అతలాకుతలం

● అవగాహనతోనే కేన్సర్ వ్యాప్తికి చెక్ ● అందుబాటులో వైద్య సేవలు

(జీజీహెచ్(కాకినాడ)/సర్పవరం జంక్షన్/రాజమహేంద్రవరం అర్బన్(ఆంధ్రజ్యోతి):

పూర్వం అరవై ఏళ్లు దాటినవారు కేన్సర్ వ్యాధి బారినపడేవారు. కేన్సర్ వ్యాధికి గురైతే ప్రాణం కోల్పోతామన్న భయందోళన ఉండేది. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. మెరుగైన చికిత్స విధానాలు అందుబాటులో ఉన్నాయి. అయితే కేన్సర్ మహమ్మారి ఏటేటా విస్తరిస్తూ ఉండడమే విషాదం. చిన్నా పెద్దా అనే వయసుతో తేడా లేకుండా ఈ వ్యాధి బారిన పడుతుండడం భయాందోళనకు గురిచేస్తోంది. ప్రజల మారిన జీవనశైలి, ఆహారపు అలవాట్లు, వంశ పారపర్యం వంటి కారణాలతో కేన్సర్ వ్యాధిగ్రస్తుల సంఖ్య పెరుగుతోందని వైద్యులు చెబుతున్నారు. ఇక కేన్సర్ వ్యాధిపై సరైన అవగాహన లేక కొందరు ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తిస్తే వైద్యులు రేడియేషన్, కీమోథెరపీ చికిత్స ద్వారా విస్తరించకుండా నివారిస్తున్నారు. నిజానికి కేన్సర్ అంటే నిశ్శబ్ద ఉపద్రవం. తెలుసుకునేలోపే అది ముదిరిపోయి ప్రాణాలను హరిస్తుంది. కేన్సర్ తొలిదశలో ఏమీ తెలియదు. ఏదైనా స్కాన్ చేయించుకుంటే తప్ప బయటపడదు. స్క్రీనింగ్ పరీక్షల ద్వారా ముందుగానే తెలుసుకుంటే దాని నుంచి బయటపడవచ్చని వైద్యులు సూచిస్తున్నారు. బ్రెస్ట్ కేన్సర్, ఊపిరితిత్తుల కేన్సర్, గర్భసంచి కేన్సర్, ఓవెరీ కేన్సర్, కొలన్ కేన్సర్, సర్కోమా కేన్సర్, చర్మ కేన్సర్ (స్కిన్), మూత్రాశయం (ప్రోస్టేట్) కేన్సర్, కొలోన్/రెక్టం (పెద్ద పేగు భాగం) కేన్సర్, కిడ్నీ కేన్సర్, బ్లడ్ కేన్సర్, అండాశయ కేన్సర్, కడుపు కేన్సర్, నోటి కేన్సర్, ఎముకల కేన్సర్, కాలేయ కేన్సర్ తదితర రకాల బారిన రోగులు పడుతున్నారు. అయితే ఇప్పటికీ కొన్ని కేన్సర్లు మొండిఘటాలుగానే ఉంటున్నాయి. ప్రాంకియాట్రిక్ కేన్సర్, బ్రెయిన్ కేన్సర్, లివర్ కేన్సర్, కడుపులో, ఊపిరితిత్తుల్లో వచ్చే కేన్సర్లు ప్రాణాంతకమేనని వైద్యులు చెబుతున్నారు.

● మహిళల్ని వేధిస్తున్న బ్రెస్ట్ కేన్సర్

మహిళల్లో ఎక్కువగా బ్రెస్ట్ కేన్సర్ బారిన పడుతున్నారు. రొమ్ములపై నొప్పిలేని గడ్డలు ఏర్పడినా, మార్పులు కనిపించినా, గడ్డలు గట్టిగా ఉన్నా, అధికంగా వచ్చినా వెంటనే ఆలస్యం చేయకుండా డాక్టర్‌ని సంప్రదించాలి. లేదంటే బ్రెస్ట్ కేన్సర్‌కు గురయ్యే ప్రమాదం ఉంది. రొమ్ముల వాపు, చనుమొనలు నొప్పి, చనుమొనల ఉంచి స్రవాలు కారడం, లోపలకి కుచించుకుపోవడం, ఎర్రగా మారడం వంటి లక్షణాలను రొమ్ముకేన్సర్‌గా భావించాలి. అధిక సంఖ్యలో మహిళలు ఈ వ్యాధి బారిన పడుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ముందస్తుగా గుర్తిస్తే కోలుకోవడం సులభం కూడా.

● తొలి దశలోనే అడ్డుకట్ట..

కేన్సర్లకు తొలిదశలోనే అడ్డుకట్ట వేయాలి. శరీరంలో ఎక్కడో ఒకచోట మొదలై చాపకింద నీరులా ఇతర భాగాలకు వ్యాపిస్తాయి. ఎన్నో అనుమానిత లక్షణాలు కనిపిస్తాయి. కాస్త జ్వరంగా అనిపించడం, ఆకలి మందగించడం, నీరసం, బరువు తగ్గడం వంటి సర్వసాధారణ లక్షణాలే ఉంటాయి. ఈ లక్షణాలు పెద్దగా పట్టించుకునేలా ఉండవు. దీంతో కేన్సర్‌ను పసిగట్టేలోపే ఇతర భాగాలను కబళిస్తాయి. నిజానికి కేన్సర్లపై కనీస అవగాహన లేకపోవడం, క్రమంతప్పకుండా స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోకపోవడం కేన్సర్‌ను గుర్తించలేకపోవడానికి కారణం. సకాలంలో గుర్తించి చికిత్స చేస్తే ప్రాణాలు కాపాడవచ్చు. మంచి చికిత్స అందిస్తే మమూలు జీవితాన్ని హాయిగా గడిపేయవచ్చు. ఎక్సరే, సీటీ స్కాన్, ఎంఆర్ఐ, బేరియం మీల్ స్టడీ, ఎముక స్కాన్, పెట్ స్కాన్, స్పెక్ట్ స్కాన్, యూఎస్‌జీ, బయాప్సీ ద్వారా వ్యాధిని నిర్ధారించవచ్చు. స్క్రీనింగ్ టెస్ట్ ద్వారా కేన్సర్‌ని గుర్తించి నివారించవచ్చని వైద్యులు పేర్కొంటున్నారు. స్క్రీనింగ్ టెస్ట్ ద్వారా వ్యాధి లక్షణాలు కనిపించకపోయినా కేన్సర్ కోసం ముందస్తుగానే గుర్తించి చికిత్స అందించే వీలుంది.


కాకినాడ జీజీహెచ్ ఆంకాలజీలో ఓపీ రద్దీ

● రిస్కుకు దూరంగా ఉండాలంటే..

పొగాకు నమలడం, ధూమపానం వంటి వాటికి దూరంగా ఉండాలి. ఆరోగ్యకరమైన బరువు మెయిన్‌టైన్ చేయడంతోపాటు మంచి ఆహారం తీసుకోవాలి. పళ్లు, కూరగాయలు ఎక్కువగా తీసుకోవాలి. యోగా, శారీరక ఎక్సర్‌సైజులు వంటి ఫిజికల్ యాక్టివిటీ నిత్యం ఉండాలి. ఆల్కహాల్‌కు దూరంగా ఉండడం, ఆల్ట్రా వయిలెట్ కిరణాలకు ఎక్స్‌పోజ్ కాకపోవడం, క్రమం తప్పకుండా కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవడం ద్వారా రిస్కుకు దూరంగా ఉండొచ్చని వైద్యులు చెబుతున్నారు.

● కాకినాడ జీజీహెచ్‌లో సేవలు..

ఉభయగోదావరి జిల్లాలోనే ఆరోగ్య వరప్రదాయినిగా పేరుగాంచిన కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రికి నిత్యం వేలాది మంది రోగులు వైద్య సేవలు కోసం విచ్చేస్తుంటారు. ఇక్కడ కేన్సర్ రోగులకోసం రేడియేషన్ అంకాలజీ యూనిట్ ఏర్పాటుచేశారు. రేడియేషన్ అంకాలజిస్ట్ యూనిట్ హెచ్‌వోడీ డాక్టర్ పి.శ్రీనివాసన్ ఆధ్వర్యంలో రోగులకు సేవలు అందిస్తున్నారు. కేన్సర్ వార్డుకి నిత్యం 30 మంది రోగులు వైద్య చికిత్సల కోసం విచ్చేస్తున్నారు. నిత్యం 8 నుంచి 10 మంది వరకు ఇన్‌పేషెంట్లుగా వార్డులో చేరుతున్నారు. 60 పడకల సామర్థ్యంతో ప్రత్యేక యూనిట్ ఉంది. ఇక్కడకు విచ్చేసిన రోగులకు రేడియోథెరపీ, కీమోథెరపీ, శస్త్రచికిత్సలు అందిస్తున్నారు. ఇక్కడకు విచ్చేసిన రోగులకు బెస్ట్ కేన్సర్, ఊపిరితిత్తుల కేన్సర్, గర్భసంచి, ఓవెరీ, కొలన్ కేన్సర్, సర్కోమా కేన్సర్ వంటి వాటికి చికిత్స అందిస్తున్నారు. అయితే జీజీహెచ్ కేన్సర్ యూనిట్ విభాగంలో వైద్య పరికరాల కొరత ఉంది. లీనియర్ ఎసెలిరేటర్ పరికరం ఉంటే అడ్వాన్స్‌డ్ రేడియేషన్ అందించే వెసులుబాటు ఉంటుంది. దీని ఖరీదు రూ.2 లక్షల నుంచి 4 లక్షల వరకు ఉంటుంది. అలాగే రొమ్ము కేన్సర్‌ని గుర్తించే మామోగ్రామ్ అందుబాటులో లేదు. హైడ్రోఎస్‌ఆర్ రేట్ బ్రేకేథెరపీ మిషన్ అందుబాటులో లేదు. ఇవన్నీ ఉంటే అడ్వాన్స్‌డ్ కేన్సర్ చికిత్స అందించేందుకు వీలుంటుంది.

ప్రాథమిక దశలో గుర్తిస్తే..



కేన్సర్‌ని ప్రాథమిక దశలో గుర్తిస్తే వ్యాధి వ్యాప్తి చెందకుండా నివారించవచ్చు. కేన్సర్‌పై గ్రామీణ ప్రాంతాలతోపాటు పట్టణవాసుల్లోనూ సరైన అవగాహన లేక వ్యాధిగ్రస్తుల సంఖ్య పెరుగుతోంది. శరీరంలో అసాధారణ రీతిలో కణితులుంటే వెంటనే డాక్టర్‌ని సంప్రదించాలి. కేన్సర్ వ్యాధి నిర్ధారణ కోసం స్క్రీనింగ్ టెస్ట్ చేయించుకుంటే అన్నివిధాలా మంచిది. మద్యపానం, ధూమపానం, వంశపారం పర్యం, ఆహారపు, జీవనశైలిలో మార్పుతో వచ్చే అవకాశం ఉంది. కేన్సర్ రోగులకు జీజీహెచ్‌లో నాణ్యమైన వైద్య సేవలు అందిస్తున్నాం. రేడియేషన్, కీమోథెరపీ, శస్త్రచికిత్సలు, మందులు అందిస్తున్నాం. అడ్వాన్స్‌డ్ ట్రీట్‌మెంట్ కోసం పలు వైద్య పరికరాలు కావాలి. వీటి మంజూరుకోసం సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి ద్వారా కలెక్టర్‌కు పంపడం జరిగింది.

- డాక్టర్ పి. శ్రీనివాసన్, హెచ్‌వోడీ, జీజీహెచ్ అంకాలజీ యూనిట్ రేడియేషన్ అంకాలజిస్ట్

● రాజమహేంద్రవరంలో జీజీహెచ్‌లో వైద్య చికిత్సలు

కేన్సర్‌కు రాజమహేంద్రవరం జీజీహెచ్‌లో వైద్య చికిత్సలు అందుబాటులోకి వచ్చాయి. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం కేన్సర్‌కు వైద్యచికిత్సలు అందించే అంకాలజీ స్పెషలిస్టులను నియమించింది. దీంతో రాజమహేంద్రవరం జీజీహెచ్‌లో సర్జరీ, కీమోథెరపీ సేవలు అందుబాటులో ఉన్నాయి. సర్జరీలు కూడా నిర్వహిస్తున్నారు. ఇక్కడ గత ఆరు నెలల కాలంలో తల, మెడ సంబంధిత కేన్సర్‌లకు సంబంధించి 9 కేసుల్లో, గైనకాలజికల్ సంబంధిత కేన్సర్లు 11, గ్యాస్ట్రో ఇంటెస్టినియల్ కేన్సర్లు నాలుగు, స్కిన్ కేన్సర్ ఒకదానికి విజయవంతంగా సర్జరీ చేశారు. అలాగే 60 కీమోథెరపీ వైద్యసేవలు అందించారు. వీటితోపాటు ప్రతినెలా రెండవ బుధవారం కేన్సర్ స్క్రీనింగ్ సేవలు అందిస్తున్నారు. జిల్లాలోని ప్రజలు, చుట్టుపక్కల ప్రాంతాల వారు రాజమహేంద్రవరం బోధనాసుపత్రిలో అందిస్తున్న కేన్సర్ వైద్యసేవలతోపాటు స్క్రీనింగ్ పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలని సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీసూర్యప్రభ కోరారు. పొగాకు నమలడం, ధూమపానం, ఆల్కహాల్‌కు దూరంగా ఉండాలని, ఆరోగ్యకరమైన బరువుతోపాటు మంచి ఆహారం తీసుకోవాలని, క్రమంతప్పకుండా కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవడం ద్వారా కేన్సర్ రిస్కుకు దూరంగా ఉండొచ్చని ఆమె చెప్పారు.


హరి తాడోజు గీసిన డోనాల్డ్ ట్రంప్ తైలవర్ణ చిత్రం

చిత్రం భళారే..

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): అమెరికా అధ్యక్ష పీఠాన్ని రెండోసారి అధిరోహించబోతున్న డోనాల్డ్ ట్రంప్‌కు అభినందనలు తెలుపుతూ రాజమహేంద్రవరానికి చెందిన ప్రముఖ చిత్రకారుడు హరి తాడోజు ట్రంప్ తైలవర్ణ చిత్రాన్ని గీసారు. బుధవారం పెయింటింగ్‌ను ఆవిష్కరించి ట్రంప్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

రేపు జడ్పీస్థాయీ సంఘాల సమావేశాలు

కాకినాడ సిటీ, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రజాపరిషత్ స్థాయి సంఘాల సమావేశాలు 8న నిర్వహించనున్నామని జడ్పీ ముఖ్య కార్యనిర్వహణాధికారి వీవీవీఎస్ లక్ష్మణరావు తెలిపారు. శుక్రవారం ఉదయం 10.30గంటల నుంచి జడ్పీ చైరన్, ఆయా సంఘాల చైర్మన్‌ల అధ్యక్షతన సమావేశాలు జరుగుతాయన్నారు. దీనికి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

‘ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలి’

జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత


పీడీజే సునీత అందజేసిన హెల్మెట్లతో న్యాయవాదులు

రాజమహేంద్రవరం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనదారులు ప్రయాణాల్లో విధిగా హెల్మెట్ ధరించాలని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డీఎల్ఎస్ఏ) చైర్ పర్సన్ గంధం సునీత పేర్కొన్నారు. డీఎల్ఎస్ఏ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కోర్టు ఆవరణలో ఏర్పాటు చేసిన రోడ్డు ప్రమాదాలపై అవగాహన సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులు, న్యాయవాదులకు ఉచితంగా హెల్మెట్లను అందజేశారు. సుప్రీంకోర్టు, హైకోర్టు ఆదేశాల మేరకు వాటిని పంపిణీ చేశామన్నారు. హెల్మెట్లు ధరించడంలో అలసత్వంవల్ల తలకు బలమైన గాయాలై మృత్యువాతపడుతున్న వారి సంఖ్య ఎక్కువగా ఉండడం ఆందోళన కలిగిస్తోందన్నారు. సీఎస్ఆర్ కింద బ్యాంకులు, హార్లిక్స్ ఫ్యాక్టరీ, ఏపీ పేపర్‌మిల్ యాజమాన్యాలు అందజేసిన 398 హెల్మెట్లను ప్రభుత్వ కళాశాలలోని విద్యార్థులు, జూనియర్ న్యాయవాదులకు వీటిని పంపిణీ చేస్తున్నామన్నారు. హెల్మెట్, సీటుబెల్టు వంటివి ప్రమాద సమయంలో ప్రాణాలు కాపాడతాయని హితవు పలికారు. కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాశ్‌బాబు, బార్ అసోసియేషన్ కార్యదర్శి పి. రమేశ్, ఎస్‌బీఐ ఆర్ఎం టి.శ్రీనివాస్, కెనరా బ్యాంకు చీఫ్ మేనేజర్ జి.రఘుకుమార్, బ్యాంక్ ఆఫ్ బరోడా మేనేజర్ కేవీఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.

డేటా పారదర్శకంగా ఉండేలా డిజిటలైజేషన్

ఎస్‌హెచ్‌జీపై ఒకరోజు శిక్షణలో మెప్మా పీడీ ప్రియంవద

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మెప్మా సంఘం సభ్యుల డేటా పారదర్శకంగా ఉండేలా డిజిటలైజేషన్ దిశగా మెప్మా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పీడీ బి.ప్రియంవద అన్నారు. రాజమహేంద్రవరం శ్రీవెంకటేశ్వర ఆనంకళా కేంద్రంలో బుధవారం మెప్మా కార్యక్రమాలు డిజిటలైజేషన్ ప్రక్రియపై తూర్పు గోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల మెప్మా సీవోలు, రిసోర్స్ పర్సన్స్ సిబ్బందికి ఎస్‌హెచ్‌జీ ప్రొఫైలింగ్ యాప్ అప్ లోడింగ్‌పై ఒకరోజు శిక్షణ జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా ఆమె హాజరయ్యారు. సమావేశంలో ప్రియంవద మాట్లాడుతూ పట్టణాల పరిధిలో స్వయం సహాయ సంఘాలు, సమైక్యలు పటిష్టత కోసం వారి పూర్తి సమాచారాన్ని ఎస్‌హెచ్‌జి ప్రొఫైల్ యాప్‌లో పొందుపరుస్తామన్నారు. స్వయం సహాయ సంఘాల సభ్యుల డేటా అంతా పారదర్శకంగా ఉండేందుకు ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు అర్హులందరికీ చేరవేసేందుకు ఈ యాప్ చాలా ఉపయోగపడుతుందన్నారు. నవంబరు 1వ తేదీ నుంచి 30వ తేదీ వరకు పూర్తి సమాచారాన్ని యాప్‌లో పొందుపరుస్తామన్నారు. స్వయం సహాయ సంఘం సభ్యులు, సమైక్యలు వారి జీవన విధానంలో మార్పులతోపాటు మెరుగైన ఉపాధిని కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ఈ విధానాన్ని చేపట్టిందన్నారు. కార్యక్రమంలో సిటీ మిషన్ మేనేజర్లు, టీఎంసీలు, పి.రవిశంకర్, కె.మోహన్ కుమార్, టీ.అనంతలక్ష్మి, డి.మంగాదేవి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న మెప్మా పీడీ ప్రియంవద


గేట్లను ఎత్తి స్విచ్ ఆన్ చేస్తున్న ఎస్ఈ శ్రీనివాసరావు

'తూర్పు' డెల్టాలో స్కవర్ స్లూయిస్ ఆపరేషన్

ధవళేశ్వరం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): తూర్పు డెల్టా పరిధిలో బుధవారం స్కవర్ స్లూయిస్‌లో ఫ్లషింగ్ ఆపరేషన్‌ను ఇరిగేషన్ అధికారులు నిర్వహించారు. ఉదయం నిర్ణయించిన ముహూర్తం సమయానికి సర్కిల్ ఎస్ఈ శ్రీనివాసరావు స్కవర్ స్లూయిస్‌లోని నాలుగు గేట్లను ఎత్తి వేశారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు నిర్వహించిన ఈ ప్రక్రియలో 7వేల క్యూసెక్కుల నీరు దిగువకు ప్రవహించినట్టు హెడ్ వర్క్స్ ఈఈ ఆర్.కాశీవిశ్వేశ్వరరావు తెలిపారు. డి.ఆనంద్‌బాబు, ఏఈ సాయిరాం సునీల్, సిబ్బంది పర్యవేక్షించారు.


హుండీల్లో వచ్చిన కానుకలను లెక్కిస్తున్న దృశ్యం

వాడపల్లి వెంకన్న హుండీల ఆదాయం రూ.1.08 కోట్లు

ఆత్రేయపురం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలోని హుండీలను పర్యవేక్షణాధికారులు ప్రసాదరాజు, కిరణ్ సమక్షంలో బుధవారం తెరిచి లెక్కించారు. 33 రోజులకు ప్రధాన హుండీల ద్వారా రూ.84,58,208, అన్నప్రసాద హుండీల ద్వారా రూ.23,75,899... మొత్తం రూ.1,08,34,107 ఆదాయం లభించింది. బంగారం 14 గ్రాములు, వెండి 700 గ్రాములు, విదేశీ కరెన్సీ లభించిందని ఉప కమిషనరు నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. క్షేత్ర పాలకుడు విశ్వేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3,06,490 వచ్చింది. లెక్కింపులో గ్రామస్తులు, దేవస్థానం ఉద్యోగులు, సిబ్బంది, బ్యాంకు సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఎస్డీపీవో రఘువీర్ విష్ణు

శలపాకలో ముగ్గురు వ్యక్తుల హత్య కేసులో...

ఐదుగురు అరెస్టు

నిందితులు రిమాండ్‌కు తరలింపు

సర్పవరం జంక్షన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాజులూరు మండలం శలపాకలో దీపావళి రోజు రాత్రి ముగ్గురు వ్యక్తులను అతి కిరాతకంగా హత్య చేసిన ఘటనలో ఐదుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. బుధవారం కాకినాడ రూరల్ పోలీస్ సర్కిల్ కార్యాలయంలో సీఐ డీఎస్ చైతన్యకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను ఎస్డీపీవో రఘువీర్ విష్ణు వెల్లడించారు. కాకినాడ జిల్లా కాజులూరు మండలం శలపాక దళితపేటకు చెందిన బత్తుల చిన్నయ్య, అతడి ఇంటి ఎదురుగా నివసిస్తున్న పొట్లకాయల నాగేశ్వరరావు కుటుంబం మధ్య మనస్పర్థలు ఉన్నాయి. దీపావళి రోజైన అక్టోబరు 31వ తేదీ రాత్రి 9 గంటల సమయంలో బత్తుల చిన్నయ్య, కుమారుడు రమేష్, సోదరుడు రాజును నాగేశ్వరరావు, భార్య బేబీ, ముగ్గురు కుమారులు సుబ్రహ్మణ్యం, దొరబాబు, వినోద్ కలిసి ఇనుపరాడ్లు, మంచం పట్టి, కర్రలతో దాడి చేసి అతి కిరాతకంగా హత్య చేశారు. తీవ్ర గాయాలతో తప్పించుకున్న బత్తుల శ్రీను కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. ప్రత్యక్ష సాక్షి, బాధితుడి వాంగ్మూలం మేరకు ఐదుగురు నిందితులను మంగళవారం సాయంత్రం కాకినాడలో అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. నిందితులు కోర్టులో లొంగిపోయేందుకు లాయర్ వద్దకు వెళ్తున్న సమయంలో అరెస్టు చేశారు. వివాహితపై అసభ్య పదజాలంతో దూషించడం, అనుచిత వ్యాఖ్యలు చేసినందుకే నిందితులు దుర్మార్గంగా ముగ్గురిని చంపినట్టు తెలిపారు. విలేకరుల సమావేశంలో గొల్లపాలెం ఎస్ఐ మోహన్‌కుమార్ పాల్గొన్నారు.


మండపేటలో దగ్ధమైన కారు ఇదే

పార్కింగ్‌లో పెట్టిన

కారులోంచి మంటలు

మండపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేటలో ఒక కారు దగ్ధమైంది. వాసవీమాత ఆలయ పార్కింగ్ ప్రదేశంలో బుధవారం సాయంత్రం నిలిపి ఉంచిన ఒక కారు నుంచి మంటలు వచ్చాయి. గమనించిన స్థానికులు వెంటనే మండపేట అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వగా వారు హుటాహుటిన వచ్చి మంటలను అదుపు చేశారు. అప్పటికే కారు చాలా వరకు కాలిపోయింది. కారు ఎందుకు దగ్ధమైంది, అది ఎవరిదనే విషయమై అగ్నిమాపక సిబ్బంది ఆరా తీశారు. కపిలేశ్వరపురం మండలం మాచరమట్లకు చెందిన శీలం ప్రసాద్‌కు చెందిన కారు (టాటా మాంజా ఏపీ05-6655)గా గుర్తించారు. ఎవరైనా దుండగులు నిప్పుపెట్టారా? లేక సాంకేతికలోపంతో దగ్ధమైందా అన్న అనుమానాలు కలుగుతున్నాయి. రూ.1.5 లక్షలు నష్టం ఉంటుందని అగ్నిమాపక సిబ్బంది చెప్పారు. కారు యజమాని స్టూడియో నిర్వహిస్తాడని, వాసవీ మాత ఆలయ పార్కింగ్ పెట్టి స్టూడియోకి వెళ్లిన సమయంలో ఈ ప్రమాదం జరిగిందని అగ్నిమాపక అధికారి హనుమంతరావు తెలిపారు. పార్కులో తీసిన చెత్త పోగుపెట్టి ఉండగా అందులో గుర్తు తెలియని వ్యక్తి సిగరెట్ కాల్చి పారేయడం వల్ల మంటలు చేలరేగి కారుకు వ్యాపించి ప్రమాదం సంభవించిందని అగ్నిమాపక సిబ్బంది చెప్పారు.

ఏడుకు చేరిన బాణసంచా మృతుల సంఖ్య

చికిత్స పొందుతున్న మరో మహిళ మృతి

ఉండ్రాజవరం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా ఉండ్రాజవరం మండలంలోని సూర్యారావుపాలెం గ్రామంలో గత నెల 30న బాణసంచా తయారీ కేంద్రంపై పిడుగు పడి పేలుడు సంభవించిన ఘటనలో చికిత్స పొందుతూ బుధవారం మరొకరు మృతి చెందారు. సంఘటన జరిగిన రోజున ఇద్దరు మృతి చెందగా ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. మంగళవారం ఒక్క రోజే చికిత్స పొందుతున్న వారిలో నలుగురు మృతి చెందారు. పశ్చిమ గోదావరి జిల్లా తణుకు మండలం దువ్వ గ్రామానికి చెందిన చుక్కా పెద్దింట్లు(45) ఏలూరు ఆశ్రమ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. దీంతో ఆ ప్రమాదంలో తీవ్ర గాయాలైన ఐదుగురూ మరణించారు. మృతుల సంఖ్య ఏడుగురికి చేరింది.

మంటల్లో చిక్కుకున్న మహిళ... చికిత్స పొందుతూ మృతి



రాజవొమ్మంగి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): దీపావళి రోజు జరిగిన అగ్ని ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన మహిళ మంగళవారం రాత్రి మృతి చెందింది. మండలంలోని వాతంగి గ్రామానికి చెందిన గుర్రపల్లి సరస్వతి (55) దీపావళి రోజు కిరాణా షాపు వద్ద మంటల్లో చిక్కుకుంది. కాకినాడ జీజీహెచ్‌కు తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందిందని జడ్డంగి ఎస్ఐ చిన్నబాబు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

కాట్రేనికోన, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): చెయ్యేరు హైస్కూల్ వద్ద బుధవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో పోరపొన్నాడ గట్టుకు చెందిన పాలెపు అంజి(20) అక్కడికక్కడే మృతి చెందాడు. అమలాపురం రొయ్యల కంపెనీలో పనిచేస్తున్న అంజి తన బంధువులతో కలిసి ఇంటికి వెళ్తుండగా ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ అవినాష్ తెలిపారు.

నేరాలను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు

ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్


ముమ్మిడివరం పోలీస్ స్టేషన్లో విలేకరులతో మాట్లాడుతున్న ఐజీ అశోక్‌కుమార్

ముమ్మిడివరం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పోక్సో, డ్రగ్స్, ఆస్తి నేరాలకు సంబంధించి ఇప్పటివరకు తమ రేంజ్‌లో 7,500 కేసులు నమోదు చేశామని ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ బి.కృష్ణారావుతో కలిసి బుధవారం సాయంత్రం ఆయన తనిఖీ చేశారు. తొలుత స్టేషన్ కార్యాలయ భవనాన్ని పరిశీలించారు. రికార్డులను చూసి అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్కే ప్రసాద్‌కు పలు సూచనలిచ్చారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ పోక్సో, డ్రగ్స్, ప్రాపర్టీ నేరాలకు సంబంధించి నేరస్తులను గుర్తించేందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశామన్నారు. ఏలూరు రేంజ్‌లో ఐదేళ్లలో ఆయా నేరాలకు పాల్పడిన 7,500 కేసులకు సంబంధించి నిందితుల వివరాలు నమోదు చేసి వారి డేటా, వేలిముద్రలు, ఫొటోలను నిక్షిప్తం చేశామన్నారు. ప్రాపర్టీ నేరస్తులు, రౌడీషీటర్ల కదలికలను గుర్తించేందుకు నిరంతర నిఘా పెట్టామన్నారు. ఈ ప్రత్యేక డ్రైవ్‌ను మరో నెల కొనసాగిస్తున్నట్టు తెలిపారు. మహిళా రక్షణకు సంబంధించి ప్రతి జిల్లాలోనూ ప్రత్యేక టీమ్‌లు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ప్రజల ఆస్తులను ధ్వంసం చేసిన వారిపై కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మహిళా పోలీసులు, మెన్ పోలీసులు, సచివాలయ పోలీసులతో కలిసి ఈవ్‌టీజింగ్ ఎక్కువగా జరిగే ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తున్నామన్నారు. కళాశాలలు, పాఠశాలలకు వెళ్లి ఈవ్‌టీజింగ్‌లపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన కల్పిస్తున్నామని.. సోషల్ మీడియా వల్ల ప్రభావితమైయువత నష్టపోతున్నారని, వారికి కూడా అవగాహన కల్పిస్తున్నామన్నారు. పాఠశాలలు, వసతిగృహాల్లో ప్రత్యేక ఫోన్ నంబర్లు అందుబాటులో ఉంచామని, నేరుగా పోలీసులకు ఫిర్యాదు చేయలేనివారు, ఆ నంబరుకు ఫోన్‌చేసి తమ సమస్యను నిర్భయంగా చెప్పవచ్చన్నారు. గంజాయి అక్రమ రవాణాకు సంబంధించి కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఏజెన్సీ ప్రాంతాల నుంచి స్కూటర్లపై 10, 15 కిలోలు తీసుకువచ్చి లూజు విక్రయాలు జరుపుతున్నారన్నారు. వారిపై నిఘా ఏర్పాటుచేసి కేసులు పెడుతున్నామని, అవసరమైతే పీడీ యాక్టు కూడా నమోదు చేస్తామన్నారు. అనాతవరంలో 2022లో జరిగిన పెదపూడి రవికుమార్ హత్య కేసును, 2023లో జరిగిన షేక్ శామ్యూల్ బాషా హత్య కేసు దర్యాప్తును వేగవంతం చేసి నిందితులను గుర్తించేందుకు అమలాపురం డీఎస్పీతో చర్చించామని చెప్పారు. ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి త్వరలోనే నిందితులను పట్టుకుంటామన్నారు. గ్రామాల్లో ఏర్పాటుచేసే ఫ్లెక్సీల వల్ల అనేక అనర్థాలు జరుగుతున్నాయని, తద్వారా సమాజంలో అందరూ నష్టపోతున్నామన్నారు. దీనిపై ప్రజల్లో అవేర్‌నెస్ తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. ఫ్లెక్సీల వల్ల శాంతి భద్రతల సమస్య తలెత్తుతుందని, ఎక్కడపడితే అక్కడ ఫ్లెక్సీలు ఏర్పాటుచేయకుండా చూడాలని ఎస్పీలకు ఆదేశాలిచ్చామన్నారు. ఏదైనా ప్రత్యేక సందర్భాల్లో ఫ్లెక్సీలు పెట్టవలసి వస్తే ఉదయం కట్టి సాయంత్రం తీసివేసేలా గ్రామపంచాయతీలకు సూచనలిచ్చామన్నారు. ఎస్పీ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ అధికారులతో సమావేశం నిర్వహించి వీటిపై ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు.

విలేకరుల సమావేశంలో ఎస్పీ బి.కృష్ణారావు, డీఎస్పీ టీఎస్ఆర్కే ప్రసాద్, ముమ్మిడివరం సీఐ ఎం.మోహన్‌కుమార్, ఎస్ఐ డి.జ్వాలాసాగర్ పాల్గొన్నారు.

మా కుమార్తె ఆచూకీ తెలపండి

కళాశాల నుంచి అదృశ్యమై 16 రోజులు గడుస్తోంది... పోలీసులు, కళాశాల యాజమాన్యం పట్టించుకోకపోతే ఎవరిని ఆశ్రయించాలి

ప్రత్తిపాడు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): 'ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న మా కుమార్తె అదృశ్యమైంది. 16 రోజులు గడుస్తున్నా ఆచూకీ లభ్యం కాలేదు. పోలీసులకు ఫిర్యాదు చేసినా, కళాశాల యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లినా మా గోడు పట్టించుకున్న వారే లేరు. బిడ్డ బతికి ఉందో లేదో తెలియని అయోమయ పరిస్థితి. దయచేసి మా బిడ్డ ఆచూకీ తెలపండి' అంటూ కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం కొడవలి గ్రామానికి చెందిన నెల్లి నూకరత్నం-రామకృష్ణ దంపతులు బుధవారం ప్రత్తిపాడులో విలేకరుల ఎదుట తమ గోడు వినిపించారు. తమ కుమార్తె ప్రత్తిపాడులోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోందన్నారు. కళాశాలకు వెళ్లి వచ్చే సమయంలో కొడవలికి చెందిన బొడ్డు జాన్ అనే వ్యక్తి వేధించేవాడని తెలిపారు. సెప్టెంబరు 6న అతడు తమ ఇంటికి వచ్చి కుమార్తెపై అత్యాచారయత్నానికి పాల్పడడంపై గొల్లప్రోలు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారని తెలిపారు. అక్టోబరు 22న తమ కుమార్తెను కళాశాల నుంచి జాన్ తీసుకెళ్లిపోయాడని ప్రత్తిపాడు పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. అదృశ్యమై 16 రోజులైనా ఎవరూ పట్టించుకోవట్లేద ని, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కలుగజేసుకోవాలని తల్లిదండ్రులు కోరారు.


మీడియాతో మాట్లాడుతున్న రామకృష్ణ-నూకరత్నం దంపతులు


కడియం దేవీచౌక్ సెంటర్లో మానవహారంగా ఏర్పడి కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న మహిళలు

హత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలి

నినదించిన ప్రజా సంఘాలు

కడియంలో కొవ్వొత్తుల ర్యాలీ, మానవహారం

కడియం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా కడియం మండలం బుర్రిలంకలో వివాహితపై అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ఐద్వా, శ్రామిక మహిళ, ఉపాధ్యాయ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కడియం బస్టాండు నుంచి దేవీచౌక్ సెంటర్ వరకు బుధవారం కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ నిర్వహించి మానవహారం నిర్మించారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని, నర్సరీల్లో పనిచేసే మహిళా కార్మికులకు రక్షణ కల్పించాలని, మహిళలు, చిన్నారుల రక్షణ కోసం సమగ్ర చట్టం తీసుకురావాలని నినాదాలు చేశారు. ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి తులసి, అంగన్వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి బేబీరాణి డిమాండ్ చేశారు. బాధిత మహిళ కుటుంబానికి రూ.25 లక్షల ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేశారు. వారికి ఉన్న మానసిక వికలాంగురాలైన కుమార్తె బాధ్యతను ప్రభుత్వం తీసుకోవాలన్నారు. మద్యం, పోర్న్ వంటివి పూర్తిస్థాయిలో నిషేధించాలన్నారు. ప్రదర్శనలో యూటీఎఫ్ నాయకురాలు విజయగౌరి, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి వెంకటలక్ష్మి, యూటీఎఫ్ నాయకులు అనిత, రాజేశ్వరి, పార్వతి, చిలుకూరి శ్రీనివాసరావు, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు జరీనా, సీనియర్ నాయకులు సావిత్రి, అంగన్వాడీ నాయకురాళ్లు సుజాత, వెంకటలక్ష్మి, మేరీ, సత్యవతి, సుబ్బలక్ష్మి ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాళ్లు నాగమణి, పద్మ, సీఐటీయూ నాయకుడు పూర్ణిమరాజు పాల్గొన్నారు.


కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహిస్తున్న మహిళలు


సమావేశంలో మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణ

11న కలెక్టరేట్ల వద్ద ధర్నా

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కార్మిక బోర్డు ద్వారా కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరుతూ ఈ నెల 11న కలెక్టరేట్‌ల ఎదుట భవన నిర్మాణ కార్మికులు ధర్నా చేస్తారని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు పుప్పాల సత్యనారాయణ వెల్లడించారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని సీపీఐ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్ వర్కర్స్, అదర్ కనస్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా జనరల్ బాడీ సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ ఇసుక, నిర్మాణ రంగంలో ముడిసరుకుల అధిక ధరలను నియంత్రించాలన్నారు. బిల్డింగ్ నిర్మాణంలో సెస్ రూపంలో వసూలు చేస్తున్న నిధులను భవన నిర్మాణ కార్మికులకే ఖర్చు చేయాలని కోరారు. 11వ తేదీన అన్ని రంగాల కార్మికులు పనులు నిలుపుదల చేసి కలెక్టరేట్‌కు తరలి రావాలని కోరారు. సమావేశంలో జిల్లా కన్వీనర్ కె.రాంబాబు, జాతీయ సమితి సభ్యుడు తోకల ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి సప్ప రమణ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న ఉదయ్ శ్రీనివాస్

ఐక్యరాజ్యసమితి సమావేశాల్లో కాకినాడ ఎంపీ

కలెక్టరేట్ (కాకినాడ), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): అమెరికాలోని న్యూయార్క్‌లో జరుగుతున్న 79వ ఐక్యరాజ్య సమితి సమావేశాల్లో కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ ఏడాది భారతదేశం నుంచి 9 మంది యువ ఎంపీలను ఆహ్వానించగా అందులో ఉదయ్ శ్రీనివాస్‌కు అవకాశం దక్కింది. ఆంధ్రప్రదేశ్ నుంచి ఎంపికైన మొట్టమొదటి ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ కావడం గమనార్హం. ప్రతిష్ఠాత్మక ఐక్యరాజ్యసమితి సమావేశాల్లో పాల్గొనే అవకాశం దక్కించుకున్న ఉదయ్‌శ్రీనివాస్‌ను కూటమి నాయకులు, కార్యకర్తలు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐక్యరాజ్య సమితి సమావేశాల్లో పాల్గొనడం గర్వంగా ఉందన్నారు. మేధావుల సూచనలు, సలహాలతో రాష్ట్ర అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. ప్రజలకు సేవ చేసే అవకాశాన్ని కల్పించిన జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

'నన్నయ'లో నేడు సాంస్కృతిక వైభవం సదస్సు


వివరాలు వెల్లడిస్తున్న ఉప కులపతి ఆచార్య శ్రీనివాసరావు

దివాన్‌చెరువు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో గురువారం నుంచి 'ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక వైభవం' సదస్సు నిర్వహిస్తున్నామని ఉప కులపతి ఆచార్య వై.శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. నన్నయ విశ్వవిద్యాలయం, సెంటర్ ఫర్ ఆంధ్రప్రదేశ్ స్టడీస్ (కాప్స్) మధ్య జరిగిన ఎంవోయూలో భాగంగా కామర్స్ అండ్ ఆర్ట్స్ కళాశాల ఆంగ్ల విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు సదస్సు జరుగుతుందన్నారు. ప్రారంభోత్సవ సభకు న్యూఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య శాంతిశ్రీ ధూళిపూడి పండిట్ హాజరవుతారు. 8వ తేదీన జరిగే ముగింపు సభకు మంత్రి కందుల దుర్గేశ్, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ హాజరవుతారు. సదస్సులో ప్రధానంగా మన రాష్ట్ర మౌలిక అస్తిత్వాన్ని ప్రభావితం చేసే అంశాలపై పత్రాలను సమర్పిస్తారు. సాంస్కృతిక వైభవం ప్రతిబింబించే విధంగా అందరి కృషితో సదస్సును విజయవంతం చేయాలని వీసీ శ్రీనివాసరావు కోరారు.


నీలాపు రేష్మ

జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీలకు

రేష్మ ఎంపిక

అమలాపురం టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ బాక్సింగ్ పోటీలకు అమలాపురం ఎస్‌కేబీఆర్ కళాశాల బీఏ మొదటి సంవత్సరం విద్యార్థిని నీలాపు రేష్మ ఎంపికైనట్టు ఫిజికల్ డైరెక్టర్ సురేష్‌కుమార్ తెలిపారు. ఆదికవి నన్నయయూనివర్సిటీ ఇంటర్ కాలేజియేట్ బాక్సింగ్ పోటీలు పెనుగొండ డాక్టర్ కేఎస్ రాజు కళాశాలలో నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రథమస్థానం సాధించిన రేష్మ స్వర్ణ పతకం దక్కించుకుంది. డిసెంబరు 26 నుంచి పంజాబ్‌లోని గురుకాశీ యూనివర్సిటీలో జరిగే ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో రేష్మ పాల్గొంటుందని తెలిపారు. ప్రిన్సిపాల్ నూకల శ్రీనివాస్‌తో పాటు పలువురు ఆమెను అభినందించారు.

అంతర్వేదిలో పొలం పిలుస్తోంది

అంతర్వేది, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): అంతర్వేది, గొంది గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాలను ఏవో పీవీ నరసింహారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. రైతులకు ప్రభుత్వం అందించే పథకాలు, పంటల ప్రాముఖ్యం గురించి రైతులకు సూచించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పెదమడిలో కార్తీక దీపోత్సవం

ఐ.పోలవరం, నవంబరు6(ఆంధ్రజ్యోతి): సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో పెదపూడిలో బుధవారం రాత్రి కార్తీక దీపోత్సవం నిర్వహించారు. ఓంకారం, స్వస్తిక్, శివలింగం ఆకృతులతో భక్తులు దీపాలు వెలిగించారు. కాకినాడ ప్రణవ ఆశ్రమ వ్యవస్థాపకురాలు స్వామిని సుమిత్రానంద సరస్వతి మాతాజీ ఈకార్యక్రమంలో మాట్లాడారు.

రాజోలు నియోజకవర్గ ప్రజల దాహార్తి తీరుస్తా



మెరకపాలెంలో వాటరు ట్యాంకుకు శంకుస్థాపన చేస్తున్న రాజోలు ఎమ్మెల్యే దేవ

రాజోలు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): రాజోలు నియోజకవర్గంలో ఉన్న 60 గ్రామాల ప్రజల దాహార్తిని తీరుస్తానని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. మెరకపాలెం, గిడుగువారిపాలెంలో ఆంధ్రప్రదేశ్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈసీ నిధులు రూ.34లక్షలతో నిర్మించనున్న 40వేల లీటర్ల వాటరు ట్యాంకుకు బుధవారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. సర్పంచ్ గిడుగు బుజ్జి, రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెద్దకాపు, రాజోలు మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి చాగంటి స్వామి, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు సూరిశెట్టి శ్రీనివాస్, గెద్దం మహాలక్ష్మీప్రసాద్, గిడుగు శేఖర్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రాజన్, జేఈ రాజు పాల్గొన్నారు.

ఉపకరణాలకు 450మంది ఎంపిక

రాజోలు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): శివకోటిలో మంగెన గంగయ్య కల్యాణ మండపంలో కలెక్టర్ ఆదేశాల మేరకు ఆంధ్రప్రదేశ్ విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సహాయ సంస్థ (డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా) ఆధ్వర్యంలో ఏఎల్ఐఎంసీవో సంస్థ ద్వారా దివ్యాంగులకు ఉపకరణాలు అందించేందుకు లబ్ధిదారుల ఎంపిక కోసం శిబిరం నిర్వహించారు. ఈశిబిరానికి రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాజోలు నియోజకవర్గం నాలుగు మండలాల నుంచి 450మంది దివ్యాంగులను ఎంపిక చేశారు. డీడబ్ల్యువో సీఆర్వో శ్రీరామ్, సూపరింటెండెంట్ రాజు, ఏవో ఎం.సత్యనారాయణ, రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెద్దకాపు, చాగంటి స్వామి, సర్పంచ్ నక్కా రామారావు, సూరిశెట్టి శ్రీనివాస్, గుబ్బల ఫణికుమార్, ఉపసర్పంచ్ పామర్తి రమణ, అడబాల విజయ్, ఉలిశెట్టి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడా రంగానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం

అమలాపురం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం క్రీడా రంగానికి అత్యధిక ప్రాధాన్యం కల్పించి విధాన పరమైన నిర్ణయాలు తీసుకుందని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి, ముఖ్య శిక్షకులు పీఎస్ సురేష్‌కుమార్ అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇతర రాష్ట్రాల కంటే మిన్నగా ఏపీ క్రీడా పాలసీని ప్రవేశపెట్టారన్నారు. క్రీడా రిజర్వేషన్లను 3శాతానికి పెంచుతూ నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. అందరికీ క్రీడలు అనే నినాదంతో నూతన క్రీడా పాలసీని ప్రతిపాదించారని చెప్పారు. క్రీడాకారుల ప్రతిభను గుర్తించి అత్యుత్తమ శిక్షణ, ప్రోత్సాహకాలు, ఉద్యోగాల కల్పన వంటి ఎన్నో కార్యక్రమాలను ప్రభుత్వం ప్రకటించిందన్నారు. ఒలింపిక్స్‌లో స్వర్ణ పతకం సాధించిన విజేతకు ప్రస్తుతం రూ.75లక్షలు ప్రోత్సాహకంగా ఇస్తున్నారని, దానిని రూ.7కోట్లకు పెంచారన్నారు. ఒలింపిక్స్ రజత పతక విజేతకు రూ.5కోట్లు, కాంస్య పతక విజేతకు రూ.3కోట్లు ప్రోత్సాహక బహుమతి అందిస్తారన్నారు. ఒలింపిక్స్‌లో పాల్గొన్న క్రీడాకారులకు గతంలో ఇచ్చే రూ.5లక్షల ప్రోత్సాహకాన్ని రూ.50లక్షలకు పెంచినట్లు చెప్పారు. ఆసియా క్రీడల్లో పాల్గొన్న క్రీడాకారులు స్వర్ణ పతకం సాధిస్తే రూ.4కోట్లు, రజత పకతానికి రూ.3కోట్లు, కాంస్య పతకానికి రూ.కోటి, ఆసియా క్రీడల్లో పాల్గొన్న వారికి రూ.10లక్షలుప్రోత్సాహకాన్ని ప్రభుత్వం ప్రకటించిందన్నారు. ప్రపంచ చాంపియన్ షిప్, ప్రపంచ కప్‌లలో పాల్గొని స్వర్ణ పతకం సాధించిన వారికి రూ.50లక్షలు, రజత పతక విజేతకు రూ.35లక్షలు, కాంస్య పతకం విజేతకు రూ.25లక్షలు ప్రకటించారన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఖేలో ఇండియా క్రీడల్లో పాల్గొనే క్రీడాకారులకు కూడా ప్రోత్సాహకాలు పెంచేందుకు నిర్ణయించారన్నారు. మండల, నియోజకవర్గ స్థాయిల్లో క్రీడా వికాస కేంద్రాలు, గ్రామ పంచాయతీల్లో క్రీడా మైదానాల ఏర్పాటుకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇవ్వడం శుభ పరిణామమన్నారు.

సనాతన ధర్మం కోసం పోరాటం

అంతర్వేదిలో మహిళా అఘోరి



అంతర్వేది, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): అంతర్వేది పుణ్యక్షేత్రం ఆవరణలో అఘోరిగా చెప్పుకుంటున్న మహిళ హల్‌చల్ చేశారు. ఆమెను చూసేందుకు, ఆమె కారు వెనక జనాలు ఎగబడ్డారు. అంతర్వేది ఆలయంలో ఆమె స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం అంతరాలయం ఎదురుగా కూర్చుని సనాతన ధర్మం గురించి, హిందూ దేవాలయాలపై దాడులు, మహిళల అఘాయిత్యాలపై మాట్లాడారు. విజయవాడ దుర్గమ్మను దర్శించుకుని శ్రీశైలం వెళతానని ఆమె చెప్పారు.

ముమ్మిడివరం మీదుగా

ముమ్మిడివరం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మహిళా అఘోరి బుధవారం ప్రత్యేక కారులో ముమ్మిడివరం మీదుగా డ్రైవింగ్ చేసుకుంటూ వెళ్లారు. మహిళా అఘోరి తొలుత ద్రాక్షారామా భీమేశ్వరస్వామిని దర్శించుకుని యానాం, ముమ్మిడివరం మీదుగా ప్రత్యేక కారులో డ్రైవ్ చేసుకుంటూ అంతర్వేది చేరుకున్నారు. అంతర్వేది లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్నారు. మహిళా అఘోరి ఈ ప్రాంతంలో కారులో వెళ్లడాన్ని స్థానిక ప్రజలు వింతగా వీక్షించారు.

ప్రజాపనుల శాఖ సిబ్బంది జీతాల పెంపు



జీవో కాపీని స్వీకరిస్తున్న ఢిల్లీ ప్రతినిధి మల్లాడి

యానాం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): యానాం ప్రజాపనుల శాఖలో పనిచేస్తున్న ఎన్ఎంఆర్‌లుగా పనిచేస్తున్న సిబ్బందికి ప్రస్తుతం ఇచ్చే జీతం రూ.పది వేల నుంచి రూ.18వేలకు పెంచుతూ పుదుచ్చేరి ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఉత్తర్వుల తొలి కాపిని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావుకు సీఎం రంగసామి అందజేశారు. జీవో విడుదల పట్ల సీఎం ఎన్.రంగాసామి, ప్రజాపనుల శాఖ మంత్రి లక్ష్మీనారాయణలను మల్లాడి సత్కరించారు. అనంతరం వీటికి సంబంధించిన అంశాలను మీడియాకు ఆయన వివరించారు. యానాంలో 15మంది సిబ్బందిని విధుల్లోకి తీసుకోకపోవడంతో పెండింగ్‌లో ఉన్నారు. అయితే వారి ఈజాబితాలో వారు ఉన్నందున, వారిని కూడా విధుల్లోకి తీసుకుని రూ.18వేలు అందజేయాలన్నారు. వీరిపై ఎటువంటి క్రిమినల్ కేసులు లేవని, చనిపోవడం మినహా మిగిలిన వారిని ఈజాబితాలోకి తీసుకోవాలని కోరారు. అదేవిధంగా ఈశాఖలో పెండింగ్‌లో ఉన్న పలు అంశాలపై సీఎంతో మల్లాడి చర్చించారు.

ప్రజాపనుల శాఖ పెండింగ్ పనులపై ఎమ్మెల్యే సమీక్ష

యానాం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రజాలనుల శాఖ కార్యాలయంలో బుధవారం ప్రజాపనుల శాఖ అధికారులతో ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ సమీక్ష నిర్వహించారు. సమీక్షలో ఆర్ఏ మునిస్వామి, ప్రజాపనుల శాఖ అధికారులు పాల్గొన్నారు. ముఖ్యంగా సీఎస్ఆర్, ఎమ్మెల్యే నిధులు, ఏడీ వెల్ఫేర్ శాఖ ద్వారా జరగాల్సిన పనులు ఎందుకు పెండింగ్‌లో ఉన్నయో అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా సంబంధిత శాఖ కార్యదర్శి, డైరెక్టర్లతో ఎమ్మెల్యే ఫోన్‌లో మాట్లాడారు. పెండింగ్ పనులు, చేపడుతున్న పనులపై చర్చించారు. యానాం మున్సిపల్ శాఖలో తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన నాటి నుంచి ఇప్పటివరకు ఎన్ని పనులు పెండింగ్‌లో ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా యానాం-ద్రాక్షారామ రోడ్డులో గ్యాస్ పైప్‌లైన్ పనులు చేపట్టడంతో రోడ్డు గుంతలు పడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈపనులు త్వరితగతిన మొదలుపెట్టాలని ఎమ్మెల్యే అన్నారు.

అల్లవరంలో 5 షాపుల్లో దొంగతనాలు

అల్లవరం, నవంబరు6(ఆంధ్రజ్యోతి): అల్లవరం పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో ప్రధాన సెంటర్లో మద్యం షాపుతో సహా 5షాపుల్లో మంగళవారం రాత్రి వరుస దొంగతనాలు జరిగాయి. దొంగలు గునపాలు ఉపయోగించి షట్టర్లు తీసి అయినకాడికి దోచుకోవడంతో వ్యాపారులు, బాధితులు ఆందోళన చెందుతున్నారు. గమిడి సూరిబాబుకు చెందిన బియ్యం దుకాణం, అల్లవరం బ్రాందీషాపులో మద్యం సీసాలు, వీరభద్ర రెస్టారెంట్, కిళ్లీ దుకాణాల్లో దొంగతనాలు జరిగాయి. నలుగురు లేదా ఐదుగురు వ్యక్తులు పథకం ప్రకారమే దొంగతనాలకు పాల్పడి ఉంటారని భావిస్తున్నారు. బాధితులు అల్లవరం పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశారు. ఎస్ఐ జి.హరీష్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు రంగంలోకి దిగి చోరీకి గురైన షాపులను పరిశీలించారు. క్లూస్‌టీమ్ వచ్చి వివరాలు సేకరించినట్లు సమాచారం.

తాచుపాము హల్‌చల్

మామిడికుదురు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): పాశర్లపూడిలంకలో బుధవారం ఐదు అడుగుల తాచుపాము హల్‌చల్ చేయడంతో స్థానికులు భయాందోళన చెందారు. గ్రామానికి చెందిన బొరుసు బుజ్జి పెరట్లో రెండు రోజులుగా ఈపాము తిరుగుతూ భయపెడుతుంది. పాశర్లపూడికి చెందిన ఫీల్డు అసిస్టెంట్ విష్ణు చాకచక్యంగా ఈ పామును పట్టుకుని దూర ప్రాంతంలో విడిచిపెట్టాడు.

ఎమ్మెల్సీ ఓట్ల అభ్యర్థన

ముమ్మిడివరం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల నియోజకవర్గ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పేరాబత్తుల రాజశేఖర్ విజయానికి కృషి చేయాలని ఎన్డీఏ నాయకులు, కార్యకర్తలు అనాతవరంలో బుధవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. తెలుగుదేశం, బీజేపీ, జనసేన పార్టీ కార్యకర్తలు అనాతవరంలో ఇంటింటికీ తిరిగి పట్టభద్రుల ఓట్లను నమోదు చేయించారు. కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కురసాల శివబాబు, మిమ్మితి చిరంజీవి, వాసంశెట్టి పట్టాభిరామయ్య, పెయ్యల వెంకటరమణ, అడబాల నాని, కర్రి రాజేష్, వర్రే చంద్రమౌళి, బొక్కా శివ పాల్గొన్నారు.

ఉమామల్లేశ్వరస్వామికి లక్షబిల్వార్చన

అల్లవరం, నవంబరు6 (ఆంధ్రజ్యోతి): అల్లవరం ఉమామల్లేశ్వరస్వామి ఆలయంలో లక్ష బిల్వార్చన, మహాలింగార్చన, జ్యోతిలింగార్చన పూజలు ఘనంగా జరిగాయి. మంగళంపల్లి పాండురంగవిఠల్ ఆధ్వర్యంలో వేద పండితులు లక్షబిల్వార్చన సుందరకాండ పారాయణం, సూర్యనమస్కార పూజలు చేశారు. అల్లవరానికి చెందిన 25మంది దంపతులు కర్తలుగా ఉమామల్లేశ్వరునికి పూజలు జరిపించారు. బండిగుప్తాపు సత్తిబాబు, ఆచంట రవి, నమ్మిన వీరబాబు, సుంకర రాము పాల్గొన్నారు.

10న అమలాపురంలో రాష్ట్ర స్థాయి చెస్ టోర్నమెంట్



రాష్ట్రస్థాయి చెస్ పోటీల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీ హరీష్‌మాధుర్

అమలాపురం టౌన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): అమలాపురం కిమ్స్ వైద్య కళాశాలలో ఈనెల10న రాష్ట్రస్థాయి చెస్ టోర్నమెంట్ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నట్టు చెస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి తాడి వెంకటసురేష్ తెలిపారు. టోర్నమెంట్ నిర్వహణపై బుధవారం దొమ్మేటివారి వీధిలోని జిల్లా చెస్ అసోసియేషన్ కార్యాలయంలో రాష్ట్ర కార్యదర్శి కవురు జగదీష్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నడూ లేనివిధంగా అత్యంత ప్రతిష్ఠాత్మకంగా రూ.5లక్షల నగదు ప్రోత్సాహక బహుమతులతో ఈపోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. రాష్ట్రంలోని 26జిల్లాల క్రీడాకారులు ఈపోటీల్లో పాల్గొనేందుకు వీలుగా పక్కాగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అండర్-7 నుంచి అండర్-15 వరకు వివిధ విభాగాల వారీగా బాలబాలికలకు ఈపోటీలు జరుగుతాయని, పెద్దవారికి ఓపెన్ కేటగిరీలో పోటీలు నిర్వహిస్తామన్నారు. పోటీలో పాల్గొనే క్రీడాకారులు ఈనెల8వ తేదీ సాయంత్రం 6గంటలలోపు తమ పేర్లు సంబంధిత వెబ్‌సైట్‌లో నమోదు చేయించుకోవాలన్నారు. రాష్ట్రస్థాయి చెస్ టోర్నమెంట్ పోటీల పోస్టర్‌ను అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్ ఆవిష్కరించారు. ఉపాధ్యక్షుడు కొత్తలంక సుధీర్, కోశాధికారి పడమట సుబ్రహ్మణ్యం, అసోసియేషన్ సభ్యులు ముషిణి మురళీధర్, బళ్ల పార్థసారధి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



అమలాపురం టౌన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు అమలాపురం విద్యానిధి కళాశాల విద్యార్థులు ఇద్దరు ఎంపికైనట్టు చైర్మన్ ఏబీ నాయుడు తెలిపారు. రామచంద్రపురంలో జరిగిన అండర్-19 బాస్కెట్‌బాల్ జిల్లాస్థాయి సెలక్షన్స్‌లో కళాశాలకు చెందిన చింతా లావణ్యశ్రీ బాలికల విభాగంలో, చప్పిడి భార్గవనాగమణికంఠ బాలుర విభాగంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జట్టు తరపున రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల9 నుంచి 11వరకు శ్రీకాకుళంలో జరిగే పోటీల్లో వీరు పాల్గొంటారు. విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ బి.సుధీర్‌బాబు, అధ్యాపకులు, సహచర విద్యార్థులు అభినందించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు చతుర్వేది



అమలాపురం టౌన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): స్కూలుగేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు అమలాపురం తులిప్స్ పబ్లిక్ స్కూలు 6వ తరగతి విద్యార్థి కనిష్కరాణా చతుర్వేది ఎంపికయ్యాడని ప్రిన్సిపాల్ నెల్లి సబిత తెలిపారు. అండర్-14 క్రికెట్ టీమ్ సెలక్షన్స్ అమలాపురం బాలయోగి స్టేడియంలో నిర్వహించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి 400మంది క్రీడాకారులు హాజరుకాగా ఉమ్మడి జిల్లా జట్టుకు అమలాపురం నుంచి రాణా ఎంపికయ్యాడు. రాణాను డైరెక్టర్ నెల్లి రమేష్‌తో పాటు ఉపాధ్యాయులు, సహచర విద్యార్థులు అభినందించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థులు



అంతర్వేది, నవంబరు6(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ శాప్ ఆధ్వర్యంలో గుంటూరు ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జరిగిన ఆలిండియా రాష్ట్రస్థాయి సివిల్ సర్వీసెస్ అథ్లెటిక్స్‌లో విజయం సాధించి త్వరలో ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించామని మల్లాడి సురేష్, కొల్లు సతీష్‌కుమార్, దాసరి జయప్రకాష్ తెలిపారు. 200మీటర్లలో వలసలతిప్ప జడ్పీ హైస్కూల్‌కు చెందిన మల్లాడి సురేష్‌బాబు మొదటిస్థానం, ట్రిపుల్‌జంప్‌లో అంతర్వేది జీవిపుంత హైస్కూల్‌కు చెందిన కొల్లు సతీష్‌కుమార్ మొదటిస్థానం, గొంది హైస్కూలుకు చెందిన దాసరి జయప్రకాష తృతీయస్థానంలో నిలిచారు.

రోడ్డు పక్కన స్కూటీ



ముమ్మిడివరం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి 216 ముమ్మిడివరం ఎయిమ్స్ ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో రోడ్డు పక్కన రెండు రోజులుగా ఒక స్కూటీ మోటారు సైకిల్‌ను పార్కుచేసి వదిలేశారు. అయితే రెండు రోజుల నుంచి ఆ స్కూటీని తీసుకువెళ్లేందుకు ఎవరూ రాకపోవడంతో స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈవిషయాన్ని స్థానికులు ముమ్మిడివరం పోలీసుల దృష్టికి తీసుకువెళ్లారు.

రూ.10,116 విరాళం

అయినవిల్లి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): అయినవిల్లి శ్రీవిఘ్నేశ్వరస్వామికి హైదరాబాద్‌కు చెందిన రామనేని రమేష్ కుటుంబ సమేతంగా బుధవారం దర్శించుకున్నారు. ప్రత్యేక పూజల అనంతరం విఘ్నేశ్వర అన్నప్రసాద ట్రస్టుకు రూ.10,116 విరాళం అందజేశారు. వీరికి ఆలయ ప్రధాన అర్చకులు వేదాశీర్వచనం చేసి శేషవస్త్రంతో సత్కరించారు. స్వామివారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

సేంద్రియ సాగు పంటలు వాడాలి

అంబాజీపేట, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): సేంద్రియ విధానం ద్వారా సాగు చేస్తే ఆరోగ్యవంతమైన పంటలను పండించవచ్చని సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తుల కేంద్ర మార్కెట్ ట్రైనర్ జె.నాగవేణి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన, ఉత్పత్తుల విక్రయ ప్రదర్శన కార్యక్రమాన్ని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు ప్రారంభించారు. ప్రతి ఇంటి వద్ద సేంద్రియ సాగుద్వారా కూరగాయలను పండించుకోవాలన్నారు. ఏవో సీహెచ్‌డీ విజయకుమార్, ఎంపీటీసీ ముత్తాబత్తుల ప్రశాంత్, నాయకులు విత్తనాల శేఖర్, కొర్లపాటి కోటబాబు, సుదాబత్తుల రాము, మైలా ఆనందరావు, జల్లి ఏడుకొండలు పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం విక్రయించుకోవాలి

ఉప్పలగుప్తం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): సార్వా ధాన్యాన్ని రైతు సేవా కేంద్రాల ద్వారా విక్రయించుకుని కనీస మద్దతు ధర పొందాలని వ్యవసాయాధికారి కుమార్‌బాబు రైతులకు సూచించారు. గొల్లవిల్లి అరిగెల నానాజీ పొలం వద్ద బుధవారం పొలంబడి నిర్వహించారు. ప్రస్తుతం ప్రభుత్వం ధాన్యం మద్దతు ధర పెంచినట్లు వివరించారు. పంట నమోదు ధ్రువీకరణ పత్రాలను రైతులకు అందించారు. రైతులు గొలకోటి సత్తిరాజు, నల్లా సత్యనారాయణ, అడబాల సత్యనారాయణ, అరిగెల నరేష్, వుండ్రు సుబ్బారావు పాల్గొన్నారు.

జేవీఎల్‌కు గ్లోబల్ ఐకాన్ అంతర్జాతీయ అవార్డు

ఐ.పోలవరం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): రాణేలంకమొల్లికి చెందిన విశ్రాంత ఆంగ్ల ఉపాధ్యాయుడు డాక్టర్ జేవీఎల్ నరసింహారావుకు రాజస్థాన్ గ్యాన్ ఉదయ్ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ ప్రతిష్ఠాత్మకమైన గ్లోబల్ ఐకాన్ అంతార్జాతీయ అవార్డును ప్రదానం చేసింది. నలభై ఏళ్లుగా ఆంగ్ల ఉపాధ్యాయుడిగా, రచయితగా, శిక్షకునిగా, సామాజిక సేవకుడిగా ఆయన విశిష్ట సేవలందిస్తున్నారు. గతంలో ఇదే స్వచ్ఛంద సంస్థ నరసింహారావును ఇండియన్ ఐకాన్, ఇంటర్నేషనల్ ఐకాన్ అవార్డులతో సత్కరించింది. మూడు ప్రపంచ రికార్డులు నెలకొల్పారు. అవార్డు గ్రహీత జేవీఎల్‌ను ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు అభినందించారు. గుత్తుల సాయి, నాగిడి నాగేశ్వరరావు, గోకవరపు వెంకట్రాజు, జగతా జానకిరామయ్య, జగతా పద్మనాభరావు, నక్కా సత్యనారాయణ, వీవీపీ సత్యనారాయణ, విత్తనాల వరప్రసాదరావు, ఎల్‌హెచ్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బ్రోచర్‌ను ఆవిష్కరించిన ఎంపీ హరీష్

కాట్రేనికోన, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): చిలకాయిచెరువులో వాలీబాల్ ప్లేయర్ మోర్త ప్రతిష్ఠ ఆధ్వర్యంలో ఈనెల24,25 తేదీల్లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల బ్రోచర్‌ను అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధుర్ బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో వెంట్రు సుధీర్, గెద్దనపల్లి సర్పంచ్ దంతులూరి సీతారామకృష్ణంరాజు, కంచర్ల కృష్ణ, పిన్నమరాజు రంగరాజు, దండు వాసురాజు, భీమవరపు శ్రీనివాస్, సాపే రూప, మెండా రాఘవ, గెద్దాడి జనార్ధనరెడ్డి పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు చర్యలు



దిండిలో మంచినీటి ప్లాంట్‌కు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే దేవ

మలికిపురం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్టు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ చెప్పారు. దిండి గ్రామంలో బుధవారం రూ.43.10లక్షలు ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, ఈసీ ఫండ్స్ ద్వారా మంజూరైన నిధులతో 40వేల లీటర్ల వాటర్ ట్యాంకు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే వేసవిలో నియోజకవర్గంలో తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే అన్నిశాఖల అధికారులతో సంప్రదింపులు జరిపామన్నారు. సర్పంచ్ ముదునూరి శ్రీనివాసరాజు, ఎంపీపీ ఎంవీ సత్యవాణి, మంగెన భూదేవి, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెద్దకాపు, ఎంపీటీసీ తాడి దుర్గాదేవి, మల్లిపూడి సత్తిబాబు, చాగంటి స్వామి, బందెల పద్మ, కడలి దుర్గాదేవి, మేడిచర్ల రాము, దేశినీడి తాతాజీ పాల్గొన్నారు.

రేషన్ పంపిణీ తీరుపై తహశీల్దార్ స్పెషల్ డ్రైవ్



ఎస్.యానాంలో రేషన్ దుకాణంలో తహసీల్దార్ తనిఖీ చేస్తున్న దృశ్యం

ఉప్పలగుప్తం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): రేషన్ పంపిణీ తీరుపై తహసీల్దార్ వాసా దివాకర్ మండిపడ్డారు. రేషన్ డీలర్ల నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఉదయం ఎనిమిది గంటలకు తహసీల్దార్ వాసా దివాకర్ ఎస్.యానాం రేషన్ షాపు తనిఖీకి వెళ్లారు. అప్పటికీ దుకాణం నుంచి ఎండీయూ కదలలేదు. ఈ-పోస్ మిషన్ సమస్య వచ్చిందని చెప్పారు. తహసీల్దార్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. డీలర్, ఎండీయూల నిర్లక్ష్యం ఉన్నట్టు గమనించారు. ఇలా మండలంలోని 36 రేషన్‌షాపులను మంగళ,బుధవారాలు ఆయన సందర్శించి రేషన్ పంపిణీ తీరును పరిశీలించారు. సకాలంలో రేషన్ పంపిణీ చేయకపోతే చర్యలు తీసుకుంటామని సిబ్బందిని హెచ్చరించారు. ప్రతి రోజూ ఉదయం ఆరు, ఎనిమిది గంటల మధ్య రేషన్ పంపిణీపై సమీక్షిస్తామన్నారు.

హెవీ డ్రైవింగ్ శిక్షణార్థులకు సర్టిఫికెట్లు

అమలాపురం టౌన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): అమలాపురం ఏపీఎస్ ఆర్టీసీ డిపోలో హెవీ డ్రైవింగ్ స్కూలులో 9వ బ్యాచ్‌లో 32రోజుల శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు జిల్లా రవాణాశాఖ అధికారి డి.శ్రీనివాసరావు సర్టిఫికెట్లు అందజేశారు. ఆర్టీసీ డిపోలో బుధవారం డిపో మేనేజర్ చల్లా సత్యనారాయణమూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి శ్రీనివాసరావు మాట్లాడారు. డ్రైవర్లకు ప్రాక్టికల్ శిక్షణతో పాటు బస్సు మెయింటినెన్స్ విషయంలో శిక్షణ ఇచ్చామని మూర్తి తెలిపారు. త్వరలోనే పదో బ్యాచ్ శిక్షణ ప్రారంభం అవుతుందని, అభ్యర్థులు డ్రైవింగ్ ఇన్‌స్ట్రక్టర్ ఎండీ రజాక్ సెల్ 7382909588ను సంప్రదించాలన్నారు.

ఘనంగా ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ పూజలు

అంబాజీపేట, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): పుల్లేటికుర్రు సెంటర్లో శుక్రవారం 27 అడుగుల శ్రీఅభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ చేయనున్నారు. బుధవారం శ్రీనివాసుల గోపాలచార్యులు బ్రహ్మత్వంలో విగ్రహ ప్రతిష్ఠ పూజలు ప్రారంభమయ్యాయి. విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, రుత్విక్‌వరణ, దీక్షాధారణ, పంచగవ్య ప్రాశన, ప్రతిష్ఠ సంకల్పం, ఆకల్మష హోమం, చతుర్వేదస్వస్తి తదితర పూజలు నిర్వహించారు.

పశువుల్లంక ఇసుక ర్యాంపు వివాదం

ఐ.పోలవరం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): పశువుల్లంక ఇసుక ర్యాంపులో వివాదం చోటుచేసుకుంది. బుధవారం నుంచి ఇక్కడ పనులు ప్రారంభించేందుకు చర్యలు చేపట్టారు. ఇసుక తీసేందుకు వైసీపీకి చెందిన వారి బోట్లు కుదరదని టీడీపీ అడ్డుతగలడంతో వివాదం చోటుచేసుకుంది. ఇరు వర్గాల మధ్య వివాదం తలెత్తడంతో పనులు నిలిచిపోయాయి.

ప్రోటోకాల్ ఉల్లంఘనపై కలెక్టర్‌కు ఫిర్యాదు

అయినవిల్లి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలో ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ కార్యక్రమంలో ప్రోటోకాల్‌ను ఉల్లంఘించారని ఎంపీపీ మట్టపర్తి నాగవిజయలక్ష్మి బుధవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. తమకు సమాచారం అందించడంలో అధికారులు నిర్లక్ష్యం వహించి, వేదికపైకి కార్యక్రమం ఆఖరున ఆహ్వానించారన్నారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

మామిడికుదురు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి బాలబాలాజీ స్వామి నిత్యాన్నదాన పథకానికి ఐ.పోలవరం మండలం గుత్తెనదీవి గ్రామానికి చెందిన కంతేటి రామకృష్ణమూర్తి-విజయలక్ష్మి దంపతులు రూ.1,00,008 విరాళంగా అందించారు. దాత దంపతులతో ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహింప చేశారు. అనంతరం వారికి ఆలయ సహాయ కమిషనర్ స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందించి అభినందించారు.

అంతర్వేది (ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యాన్నదానట్రస్టుకు గుత్తెనదీవికి చెందిన కంతేటి రామకృష్ణమూర్తి-విజయలక్ష్మి దంపతులు రూ.1,00,008 విరాళంగా అందించారు. దాతకు ఆలయ అధికారులు స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను అందించి అభినందించారు. ఆలయ అధికారులు శ్రీదేవి, కిరణ్, అన్నదానం స్వామి, కంప్యూటర్ అసిస్టెంట్ నరసింహ, సత్తిబాబు పాల్గొన్నారు.

ఘనంగా గోవృషభ కల్యాణం

అంబాజీపేట, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): గంగలకుర్రు కొల్లూరి బాబూరావు, సుబ్రహ్మణ్య పవన్ ఆధ్వర్యంలో బుధవారం గోవృషభ కల్యాణం ఘనంగా నిర్వహించారు. పెద్దింటి గోపాలచార్యులు వేదమంత్రోచ్చారణలతో రుక్మిణీ సత్యభామ సమేత మదనగోపాలస్వామి ఆలయం అర్చకులు పెద్దింటి గోపి ఆధ్వర్యంలో పవన్-గాయత్రి దంపతులు త్రియాన్నిక దీక్షతో లక్ష్మీనారాయణ యజ్ఞాన్ని వైఖానస ఆగమ శాస్త్ర ప్రకారం నిర్వహించారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు.

ఉపకరణాల శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ముమ్మిడివరం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు అవసరమైన చలన ఉపకరణాలను ఉచితంగా అందించేందుకు ఏర్పాటు చేస్తున్న శిబిరాన్ని సద్వినయోగం చేసుకోవాలని ముమ్మిడివరం ఎంపీడీవో తాడి శ్రీవెంకటాచార్య పేర్కొన్నారు. ముమ్మిడివరం శ్రీకృష్ణదేవరాయ కాపు కల్యాణ మండపంలో ఈనెల8వ తేదీ ఉదయం 9నుంచి సాయంత్రం 3గంటల వరకు శిబిరాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ముమ్మిడివరం మండలం, పట్టణం, ఐ.పోలవరం, తాళ్లరేవు, కాట్రేనికోన మండలాలకు సంబంధించి దివ్యాంగులకు అవసరమైన చలన ఉపకరణాలను ఉచితంగా సరఫరా చేసేందుకు ఎలైన్‌కో సంస్థ ద్వారా అర్హులైన దివ్యాంగులను గుర్తించేందుకు శిబిరం నిర్వహిస్తున్నారన్నారు. సదరం సర్టిఫికెట్, యూడీ ఐడీ కార్డు జిరాక్సు కాపీలు తీసుకురావాలని, అన్ని ఉపకరణాలు పొందేందుకు 40 శాతం వైకల్యం తప్పనిసరి అన్నారు. బ్యాటరీ ఆపరేటింగ్ సైకిల్‌కు 80శాతం అంగవైకల్యం తప్పనిసరి అన్నారు. రేషన్‌కార్డు, ఆదాయానికి సంబంధించిన ధ్రువీకరణ పత్రం తీసుకురావాలన్నారు. ఆధార్‌కార్డు జిరాక్సు, రెండు ఫొటోలు, రేషన్ కార్డు, గుర్తింపుకార్డు తీసుకుని రావాల్సిందిగా సూచించారు.





గంగవరంలో ఉల్లాస్ కేంద్రం ప్రారంభం

కె.గంగవరం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): వయోజనులకు విద్య అందించడానికి కూటమి ప్రభుత్వం ఉల్లాస్ కేంద్రాలు ఏర్పాటు చేస్తుంది. వీటిని సద్వినియోగం చేసుకోవాలని జనసేన మండల అధ్యక్షుడు చిర్రా రాజ్‌కుమార్ అన్నారు. కె.గంగవరంలోని అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం ఆయన ఉల్లాస్ కేంద్రాన్ని ప్రారంభించారు.

ఘనంగా కార్తీక దీపోత్సవం

ఐ.పోలవరం, నవంబరు6(ఆంధ్రజ్యోతి): సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో పెదపూడిలో బుధవారం రాత్రి కార్తీక దీపోత్సవం నిర్వహించారు. ఓంకారం, స్వస్తిక్, శివలింగం ఆకృతులతో భక్తులు దీపాలు వెలిగించారు. కాకినాడ ప్రణవ ఆశ్రమ వ్యవస్థాపకురాలు స్వామిని సుమిత్రానంద సరస్వతి మాతాజీ ఈకార్యక్రమంలో మాట్లాడారు.

ధాన్యం సొమ్ములు 2రోజుల్లో రైతు ఖాతాలో జమ



మాట్లాడుతున్న జిల్లా జాయింట్ కలెక్టర్ నిశాంతి

మండపేట, నవంబరు6(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిశాంతి అన్నారు. ద్వారపూడిలో బుధవారం జెడ్.మేడపాడు సహకార సంఘ భవనంలో ధాన్యం కొను గోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం ఆమె స్థానిక రైతులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. రైతులు ధాన్యాన్ని రైతుసేవా కేంద్రాలు ద్వారా విక్రయించుకోవాలన్నారు. ధాన్యానికి మద్దతు ధర కల్పించడంతో పాటు రవాణా ఖర్చులు, హమాలీ చార్జీలు రైతులకు ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. ధాన్యం అమ్మిన రైతుకు 48 గంటల్లో నేరుగా రైతు బ్యాంకు ఖాతాలో నగదు జమవుతుందన్నారు. జిల్లాలో ఈఏడాది ఖరీఫ్‌లో వరి కోతలు ప్రారంభమయ్యాయని, ధాన్యం కొనుగోలు కోసం జిల్లాలో 370 కొనుగోలు కేంద్రాలను రైతుసేవాకేంద్రాల్లో ఏర్పాటు చేశామని జేసీ చెప్పారు. వ్యవసాయ శాఖ లెక్కల ప్రకారం ధాన్యం దిగుబడి 3.62లక్షలు మెట్రిక్‌టన్నులు వస్తుందని, అందులో ప్రభుత్వం 2.30లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయాలని లక్ష్యంగా నిర్ణయించామన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 2000ఎకరాల్లో వరికోతలు పూర్తయ్యాయని జిల్లా వ్యవసాయాధికారి బోస్ తెలిపారు. వివిధ శాఖల అధికారులు సమావేశంలో మాట్లాడారు. సమావేశంలో సివిల్‌సప్లయిస్ డీఎం బాలసరస్వతి, ఆర్‌టీవో డి.శ్రీనివాసరావు, డీఎస్‌వో ఉదయ భాస్కర్, జిల్లా మార్కెటింగ్ శాఖ ఏడీ కె.విశాలాక్షి, జిల్లా సహకార అధికారి మురళీకృష్ణ, మండపేట తహసీల్దార్ తేజేశ్వరరావు తాలుకా రైస్ మిల్లర్ల సంఘ నాయకులు, మండపేట ఈవోపీఆర్డీ దాసరి శ్రీనివాసరావు, ద్వారపూడి పంచాయతీ కార్యదర్శి ఆకులు వీ.వీరమణ, అమర్‌నాథ్ చౌదరి, మండల వ్యవసాయాధికారి యేసుబాబు, టీడీపీ మండల అధ్యక్షుడు యరగతపు బాబ్జి, జనసేన నాయకుడు చింతా దొరబాబు, బీజేపీ నాయకుడు మురళీకృష్ణ, రైస్‌మిల్లర్స్, రైతులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు: ఐజీ అశోక్‌కుమార్



రావులపాలెం రూరల్ సర్కిల్ కార్యాలయంలో సిబ్బందితో ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్



అత్యాచార చట్టంపై అవగాహన కల్పిస్తున్న అడిషనల్ ఎస్పీ అష్మాఫర్వాన్

రావులపాలెం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపడతామని ఏలూరు రేంజ్‌ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ అన్నారు. రావులపాలెం రూరల్ సర్కిల్ కార్యాలయాన్ని బుధవారం రాత్రి ఎస్పీ బీవీ కృష్ణారావుతో కలిసి సందర్శించారు. ముందుగా కార్యాలయంలోనే రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ నేరాలు అదుపునకు ప్రత్యేక చర్యలు చేపడతామన్నారు. ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల అధికారులను సమన్వయం చేసుకుని నేరాలు, ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. రావులపాలెం మండలంలోని గౌతమి, వశిష్ట వంతెనల సమీపంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు చేపడతామన్నారు. సిబ్బంది కొరత కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న కోనసీమ జిల్లాకు పోలీస్ రిక్రూట్‌మెంట్‌లో ప్రాధాన్యం కల్పిస్తామన్నారు. నేరాలను అదుపు చేసుకునేందుకు రావులపాలెం పరిధిలో ట్రైనీ ఎస్‌ఐను నియమించేందుకు కార్యచరణ రూపొందిస్తామన్నారు. పాతనేరస్థుల కదలికలపై నిఘా ఉంచామన్నారు. డీఎస్పీ వై.గోవిందరావు, రూరల్ సీఐ విద్యాసాగర్, టౌన్ సీఐ శేఖర్‌బాబు, కొత్తపేట ఎస్‌ఐ సురేంద్ర, ఆలమూరు ఎస్‌ఐ అశోక్, ఆత్రేయపురం ఎస్‌ఐ ఎస్.రాము, సిబ్బంది పాల్గొన్నారు.

అత్యాచార చట్టంపై అవగాహన

రావులపాలెం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): రావులపాలెం కాపు కల్యాణ మండపంలో అత్యాచార చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. రాష్ట్ర క్రైమ్ ఇన్వెస్టిగేషన్ డిపార్టుమెంట్, సీఐడీ అడిషనల్ డీజీపీ రవిశంకర్ అయ్యానర్, ఐజీ వినీత్ బ్రాజ్‌లాల్ ఆదేశాల మేరకు రాజమహేంద్రవరం క్రైమ్ ఇన్వెస్టిగేషన్ అడిషనల్ ఎస్పీ అష్మాఫర్వాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీలపై జరిగే నేరాల అదుపునకు తీసుకునే చర్యలపై వివరించారు. అత్యాచార ఘటనలపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. ఘటనలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. కొత్తపేట డీఎస్పీ గోవిందరావు, తహశీల్దారు ముక్తేశ్వరరావు, ఎంపీడీవో ముక్తేశ్వరరావు, సోషల్ వెల్ఫేర్ అధికారి కె.హేమలత, దళిత బహుజన శ్రామిక యూనియన్ సెక్రటరీ పి.శేషారత్నం పలు అంశాలపై మాట్లాడారు.

విద్యాభివృద్ధికి మునసబు సేవలు చిరస్మరణీయం



మునసబు విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

రాయవరం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో విద్యాభివృద్ధికి మాజీ ఎమ్మెల్సీ ఉండవల్లి సత్యనారాయణమూర్తి (రాయవరం మునసబు) చేసిన సేవలు చిరస్మరణీయం అని వక్తలు కొనియాడారు. బుధవారం రాయవరంలో మునసబు వర్ధంతిని నిర్వహించారు. రామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, స్థానిక చేనేత సహకారసంఘం వద్ద దళితపేటలో ఉన్న మునసబు విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. గ్రామీణ ప్రాంతాల్లో పేద విద్యార్థుల కోసం పాఠశాల, కళాశాలను స్థాపించి ఎంతో మంది విద్యార్థులకు విద్యనందించిన ఘనత ఆయనకు చెందుతుందని వక్తలు ఈ సందర్భంగా కొనియాడారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ సీనియర్ నాయకుడు ఉండవల్లి రాంబాబు, ఎంపీపీ నౌడు వెంకట రమణ, సర్పంచ్ చంద్రమళ్ల రామకృష్ణ, మూర్తినీడి రాము, మంతెన అచ్యుతరామరాజు, తేతల సుబ్బి రామిరెడ్డి, ఎస్ఎంసి చైర్మన్ దేవిశెట్టి కోటేశ్వరరావు, రిమ్మలపూడి సుబ్బారావు చౌదరి, ఉండవల్లి శ్రీను, అంద్ర సుకుమార్, కుడుపూడి సూర్యనారాయణ, మూర్తినీడి రాజు, పి.మణిదీప్, లంక చందు, మచ్చా సూర్యారావు, మునసబు అభిమానులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

భీమేశ్వరాలయంలో అఘోరి పూజలు



ద్రాక్షారామ, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ భీమేశ్వరాలయాన్ని బుధవారం అఘోరి సందర్శించారు. ఆలయంలోకి ప్రవేశిస్తూ దారిలో చిన్నారి కాళ్లకు నమస్కరించారు. భీమేశ్వరస్వామి ఎదురుగా ఒంటికాలిపై నిలుచుకుని భీమేశ్వరుని నమస్కరించారు. తలను నేలను తాకించి ప్రణామం సమర్పించారు. అనంతరం మాణిక్యాంబ అమ్మవారిని దర్శించుకున్నారు. అఘోరిని చూసేందుకు స్థానికులు ఎగబడ్డారు. లోక కల్యాణార్థం ఆలయాలు సందర్శిస్తున్నానని, రాత్రి 12 గంటల నుంచి హోమాలు, పూజలు చేస్తున్నట్లు చెప్పారు. ప్రతీ ఒక్కరూ ఆడపిల్లలను రక్షించుకుందాం, గోహత్యలను ఆపుదాం.. అందరూ కలసికట్టుగా మన ఇంట్లో రక్షించుకుంటే చాలు అన్నారు.

అన్నదాన భవన నిర్మాణానికి రూ.లక్ష విరాళం

ఆత్రేయపురం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్మిస్తున్న వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి ఐ.పోలవరం మండలం గుత్తెనదీవికి చెందిన కంతేటి రామకృష్ణమూర్తి- విజయలక్ష్మి దంపతులు రూ.1,00,008 విరాళం సమర్పించారు. బుధవారం వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.4,22,189 లభించినట్టు ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.

బాక్సింగ్ పోటీల్లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల ప్రతిభ



బాక్సింగ్ పోటీల్లో బంగారు, వెండి పతకాలు సాధించిన వీకేవీ డిగ్రీ కళాశాల విద్యార్థులు

కొత్తపేట, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ యూనివర్శిటీ ఇంటర్ కాలేజీ ఎట్ మరియు ఇంటర్ యూనివర్శిటీ టీమ్ 2024-25 సంవత్సరానికి బాక్సింగ్ మెన్, ఉమెన్ సెలక్షన్ ట్రైల్స్‌లో భాగంగా నిర్వహించిన బాక్సింగ్ టోర్నమెంట్‌లో వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన బీఏ మొదటి సంవత్సరం చదువుతున్న సీహెచ్ పృధ్వీరాజ్ 60-63.5 కేటగిరిలో గోల్డ్‌మెడల్ సాధించి ఆదికవి నన్నయ యూనివర్శిటీ బాక్సింగ్ మెన్ టీమ్ సెలక్ట్ అయ్యాడు. బీఎస్సీ కంప్యూటర్ సైన్సు మొదటి సంవత్సరం చదువుతున్న బి.ప్రభాష్ 54-57 కేజీల కేటగిరిలో సిల్వర్ మెడల్స్ సాధించారు. తమ కళాశాలకు చెందిన ఇరువురువిద్యార్థులు బాక్సింగ్‌లో ప్రతిభ కనబరిచినందుకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేపీ రాజు, వైస్‌ప్రిన్సిపాల్ రమాదేవి, పీడీ కనకరాజు, అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

సమస్యలపై 104సిబ్బంది వినతి

కపిలేశ్వరపురం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): అంగర పీహెచ్‌సీలో వైద్యాధికారిణి డా. రత్నకుమారికి బుధవారం మండలంలోని 104సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేసారు. ఈ సందర్భంగా 104సిబ్బంది మాట్లాడుతూ అరబిందో యాజమాన్యం చెల్లించాల్సిన జీతాలను వెంటనే చెల్లించాలని, 104 సర్వీసులను గతంలో వలే పీహెచ్‌సీ ద్వారా నిర్వహించాలన్నారు. దీనివల్ల ఖర్చు రూ.50వేలు మాత్రమే అవుతుందన్నారు. 2020లో జాయిన్ అయిన ఉద్యోగస్థులకు జీవో నం.7 ప్రకారం జీతాలు చెల్లించాలని, సీనియర్ డ్రైవర్లను ఇతర వైద్యశాఖలో కాంట్రాక్టు పద్ధతిలో నియమించాలని కోరారు. పీఎఫ్, ఈఎస్‌ఐ యాజమాన్యం వాటా చెల్లించడంతో పాటు ప్రతీ వాహనానికి ఫిట్‌నెస్, ఇన్సూరెన్స్ చేయించాలని కోరారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి

కపిలేశ్వరపురం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ పంటకు సంబంధించి ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ చిన్నారావు అన్నారు. బుధవారం మండలంలోని టేకి రైతుసేవా కేంద్రం వద్ద ఆయన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 14 రైతుసేవా కేంద్రాల వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ధాన్యం సిద్ధంగా ఉన్నట్లయితే రైతు సేవాకేంద్రానికి తెలియచేసి రైతులు ధాన్యం విక్రయించుకోవాలన్నారు. గ్రామకార్యదర్శి రామకృష్ణ, సొసైటీ సీఈవో విజయ్‌కుమార్, వీఆర్‌వోలు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

బాస్కెట్ బాల్ పోటీలకు టీమ్ కెప్టెన్‌గా ఐశ్వర్యాంబిక



రామచంద్రపురం(ద్రాక్షారామ), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం కృత్తివెంటి పేర్రాజు పంతులు జాతీయోన్నత పాఠశాల విద్యార్థిని చేకూరి ఐశ్వర్యాంబిక జాతీయ స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఏపీ జట్టు కెప్టెన్‌గా ఎంపికైనట్లు హెచ్ఎం రెడ్డి తెలిపారు. ఇటీవల ఎస్‌జీఎఫ్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బాస్కెట్‌బాల్ ఎంపికలలో ఎంపికైన ఐశ్వర్యాంబిక పల్నాడు జిల్లా నరసరావుపేటలో జరిగిన అండర్ 14 విభాగంలో రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ బాస్కెట్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనపరచి ఉమ్మడి తూర్పుగోదావరి తూర్పుగోదావరి జిల్లా ప్రథమస్థానంలో నిలిచేలా కృషి చేసిందన్నారు. ఈనెల17 నుంచి 28వరకు ఛత్తీస్‌గఢ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఏపీ జట్టు కెప్టెన్‌గా ఎంపికైనట్లు వివరించారు. ఐశ్వర్యాంబికను హెచ్ఎం టి.వి.రాఘవరెడ్డి, ఎస్ఎంసీ చైర్మన్ గంగరాజు, రామచంద్రపురం బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు డా. చెలికాని స్టాలిన్, బాస్కెట్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ఇండియా సంయుక్త కార్యదర్శి గన్నమని చక్రవర్తి, ఉపాధ్యాయని, ఉపాధ్యాయులు అభినందించారు.

ఎంపీ బోస్‌కు జీవితబీమా ఏజెంట్ల వినతి

రామచంద్రపురం(ద్రాక్షారామ), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జీవితబీమా ఏజెంట్లు బుధవారం రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్‌కు వినతి పత్రం అందజేశారు. స్థానిక ఎంపీ క్యాంపు కార్యాలయంలో ఏజెంట్ల అసోసియేషన్ లియాఫీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఎస్‌కేఎం కేకే మస్తాన్, ఏజెంట్లు అసోసియేషన్ నాయకులు ఎంపీని కలిశారు. ఇటీవల జీవిత బీమా సంస్థ తీసుకువచ్చిన సంస్కరణలు ఏజెంట్లకు, పాలసీదారులకు చేకూరుతున్న నష్టాలను వివరించారు. సమస్యలు పరిష్కరించాలని కోరారు.

ఎమ్మెల్సీ ఓట్ల నమోదు వేగవంతం



శివలలో ఎమ్మెల్సీ ఓట్లు నమోదు చేస్తున్న కూటమి నాయకులు

కె.గంగవరం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఓట్లు నమోదు చివరిరోజు వేగం పుంజుకుంది. సీఎం చంద్రబాబు నాయుడు కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌ను ఈవిషయమై మందలించడంతో కూటమి పార్టీ నాయకులు ఛాలెంజ్‌గా తీసుకుని సభ్యత్వ నమోదు చేశారు. ఆయా గ్రామాల్లో పార్టీ నాయకులు పట్టభద్రులను గుర్తించి స్వయంగా వారి వద్దకు వెళ్లి దరఖాస్తులు పూర్తి చేయించారు. శివలలో పార్టీ సీనియర్ నాయకుడు నిడదవోలు సుబ్రహ్మణ్యం, కె.గంగవరంలో జనసేన మండల అధ్యక్షుడు చిర్రా రాజ్‌కుమార్, పామర్రులో సీనియర్ నాయకుడు మరివాడ సూరిబాబులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఓట్లు నమోదు చేయించారు. బీజేపీ నాయకుడు సలాది శేఖర్ ఆధ్వర్యంలో సత్యవాడలో ఎమ్మెల్సీ ఓట్లు భారీగా నమోదు చేయించారు.

ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ పూజలు

కపిలేశ్వరపురం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మాచరలో ఈనెల 8న ఉదయం 7.13 గంటలకు శ్రీఅభయ ఆంజనేయస్వామి 45అడుగుల విగ్రహ ఆవిష్కరణ సందర్భంగా బుధవారం ఆలయం వద్ద విగ్రహ ప్రతిష్ఠ పూజలు ప్రారంభించారు. పలువురు పండితులు విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, దీక్షాధారణ, తదితర పూజా కార్యక్రమాలను వేదమంత్రోచ్ఛారణల నడుమ శాస్త్రోక్తంగా నిర్వహించారు.



అయ్యప్పస్వామి ఆలయంలో ఉయ్యాల సేవ జరుపుతున్న స్వాములు

అయ్యప్ప ఆలయంలో కార్తీక పూజలు

ఆత్రేయపురం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం మండలం ర్యాలి హరిహరపుత్ర అయ్యప్పస్వామి ఆలయంలో కార్తీకమాసం పూజలు జరిగాయి. మండల దీక్ష చేస్తున్న వందలాది మంది అయ్యప్ప స్వాములు ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పంచామృతాభిషేకం, సహస్ర పూజ, దీపోత్సవం, హోమం, లక్షపత్రి పూజ, సూర్య నమస్కారాలు జరిపారు. ఈ పూజల్లో అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

టేకు దుంగల వేలం ఖరారు

ఆలమూరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఆవరణలో పెరిగిన టేకు దుంగలకు బుధవారం జరిపిన వేలంలో పాటదారులకు దాన్ని ఖరారు చేశారు. కాలేజీ ఆవరణలోనున్న పది దుంగలకు కాలేజీ ప్రిన్సిపాల్ కృష్ణ అధ్వర్యంలో జరిగిన వేలంలో రూ.2.28 లక్షలకు ఆలమూరుకు చెందిన చల్లా సత్యనారాయణ దక్కించుకున్నారు. ఈ వేలంలో అటవీశాఖ అధికారి కె.రాంబాబు, ఎస్‌ఓ వి.సోమశేఖర్, కాలేజీ కమిటీ సభ్యులు గారపాటి త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

వాహన రికార్డులు పక్కాగా ఉండాలి



రికార్డులు సక్రమంగా లేని వాహనాలకు ఫైన్ వేస్తున్న ఎంవీఐ శ్రీనివాస్

రావులపాలెం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): వాహనదారులు రికార్డులన్నీ సక్రమంగా ఉండేలా చూసుకోవాలి రావులపాలెం ఎంవీఐ శ్రీనివాస్ సూచించారు. ఈతకోట జాతీయ రహదారిపై బుధవారం వాహనాల తనిఖీ జరిపారు. టాక్సులు కట్టని వాహనాలతో పాటు డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా నడుపుతున్న వారికి ఫైన్ వేశారు. ఆయన మాట్లాడుతూ నిరంతరం వాహనాల రికార్డుల తనిఖీలు జరుపుతామన్నారు.



అమలాపురం- బొబ్బర్లంక ఆర్అండ్‌బీ రహదారిపై గోతులు



కుంగిపోయిన ఆత్రేయపురం మండలం పులిదిండి రోడ్డు

ఆర్అండ్‌బీ రహదారులు అధ్వానం

• భారీ వాహనాల రాకపోకలతో ధ్వంసమవుతున్న వైనం • చోద్యం చూస్తున్న యంత్రాంగం • ప్రజలకు తప్పని పాట్లు

ఆత్రేయపురం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): అక్కడి రహదారులపై ప్రయాణం చేయాలంటే నరకానికి దారులుగా మారాయి. ప్రతిరోజూ భారీ వాహనాల రాకపోకలతో రోడ్లన్నీ కుంగిపోయి అస్తవ్యస్తంగా మారాయి. ఆత్రేయపురం మండలంలోని వివిధ గ్రామాలకు వెళ్లే ఆర్అండ్‌బీ రహదారుల దుస్థితి మరీ అధ్వానంగా మారింది. ఇసుక లారీలు విచ్చలవిడిగా రహదారులపై పరుగులు పెట్టడంతో పెద్దగోతులు ఏర్పడ్డాయి. ర్యాలి, పులిదిండి, వెలిచేరు ఆర్అండ్‌బీ రహదారులతో పాటు బొబ్బర్లంక నుంచి అమలాపురం వెళ్లే రోడ్లు ధ్వంసమవడంతో ప్రయాణికుల రాకపోకలకు ఇబ్బందిగా మారాయి. పులిదిండి ఇసుక ర్యాంపు నుంచి భారీ వాహనాల రాకపోకలు సాగించడంతో రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. పేరవరం నుంచి వెలిచేరు వరకు ఆర్అండ్‌బీ రహదారిపై మరమ్మతు పనులు చేపట్టిన అనతి కాలంలోనే యథాస్థితికి చేరుకుంది. దీంతో వాహనదారులు పడరానిపాట్లు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం ఈ రోడ్లకు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

భూ సర్వే రద్దు చేయాలని రైతుల ధర్నా



కూళ్ల మెయిన్ రోడ్డులో పంచాయతీ వద్ద ధర్నా చేస్తున్న రైతులు

కె.గంగవరం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం తెచ్చిన భూసర్వే ప్రాజెక్టును రద్దు చేయాలని కూళ్ళ రైతులు ధర్నా చేశారు. బుధవారం కూళ్ల గ్రామంలో రెవెన్యూ సదస్సు జరిపారు. భూసర్వేలో వచ్చిన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సదస్సు నిర్వహిస్తుందని, రైతులు దరఖాస్తులు చేసుకోవాలని తహశీల్దార్ బండి మృత్యుంజయరావు, ఎంపీపీ పంపన నాగమణి సుబ్బారావు కోరారు. దీంతో రైతులు భూ సర్వేను వ్యతిరేకిస్తూ ప్రధాన రహదారిపై ధర్నా చేశారు. తహశీల్దార్ మృత్యుంజయరావు ఆందోళన చేస్తున్న రైతులతో మాట్లాడారు. భూ సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం సదస్సులు నిర్వహిస్తున్నదని, దరఖాస్తు చేసుకుంటే రైతుకు న్యాయం జరుగుతుందని చెప్పడంతో వారు ఆందోళన విరమించారు. రెవెన్యూ సదస్సులో సర్పంచ్ చిల్లి నాగేశ్వరరావు, మాజీ సర్పంచ్ పి.గోవిందరాజు, సర్వేయర్ పావని తదితరులు పాల్గొన్నారు. ఆందోళనలో రైతులు సి.సుబ్బారావు, డి.శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

ట్యాక్సీ ఓనర్స్, డ్రైవర్స్ యూనియన్ కార్యవర్గం

రామచంద్రపురం(ద్రాక్షారామ), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురంలో లక్ష్మీగణపతి ట్యాక్సీ ఓనర్స్ అండ్ డ్రైవర్స్ యూనియన్ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా చోడవరపు వెంకట్రావు, అధ్యక్షుడిగా గుబ్బల సత్యనారాయణ, ఉపాధ్యక్షుడుగా ఎస్.కె. అన్వర్ బాషా, కార్యదర్శిగా వెలుగుల శ్రీనివాస్ నాయుడు, సంయుక్త కార్యదర్శిగా మేడిశెట్టి వెంకటదుర్గ శివప్రసాద్, కార్యవర్గ సభ్యులుగా కలిదిండి సుదీర్, డి.మురళి రవికృష్ణ, టి.గణేష్, వి.కృష్ణ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వీరిని పలువురు అభినందించారు.

నేటి నుంచి వేంకటేశ్వరస్వామి ఉత్సవాలు



వేంకటేశ్వరస్వామి

మండపేట, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోనున్న వేంకటేశ్వరస్వామి ఉత్సవాలను ఈనెల 7 నుంచి నాలుగు రోజులపాటు నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. గురువారం స్వామివారి తిరువీధి ఉత్సవం, ఊరేగింపు, స్వామివారి కల్యాణం, 8న శుక్రవారం స్వామివారికి పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు, 9న పంచామృత అభిషేకం, లక్ష తులసి పూజ, 10న స్వామివారికి విష్ణుసహస్రనామ పారాయణం, పవళింపుసేవ నిర్వహిస్తున్నట్టు ఆలయ ట్రస్టీ ధర్మకర్తల మండలి సభ్యులు తెలిపారు. ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూకదుర్గారాణి ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు.



రాయవరం పీహెచ్‌సీని తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో దొర

పీహెచ్‌సీల తనిఖీ

రాయవరం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాచవరం, రాయవరం పీహెచ్‌సీలను బుధవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి దుర్గారావు దొర ఆకస్మిక తనిఖీలు చేశారు. రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. రోగులకు ఎక్కడా అసౌకర్యం కలుగకూడదన్నారు. పీహెచ్‌సీల ద్వారా అమలవుతున్న కార్యక్రమాలు, పీహెచ్‌సీల టార్గెట్‌లు ఎంత మేరకు చేరుకుంటున్నారే విషయాలను ఆయన ఆరా తీశారు. అనంతరం రికార్డులు తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారులు ఎం.శ్రీనివాస్, ఏ.మణికంఠ, వి.అనిరుద్, రమ్యశ్రీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అమరవీరుల సంస్మరణ ర్యాలీ



బదుగువానిలంకలో రైతుకూలీ సంఘం ర్యాలీ

ఆలమూరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): బదుగువానిలంకలో భూహక్కుల పోరాటంలో అమరులైన వారి సంస్మరణ సభను బుధవారం జరిపారు. అఖిల భారత రైతుకూలీ సంఘం జిల్లా నాయకుడు జె.సత్తిబాబు సారథ్యంలో స్థానిక రైతుకూలీ సంఘం నాయకుడు తూలూరి ప్రేమానందం అధ్యక్షత అమరవీరుల వర్ధంతి సభ జరిపారు. సీపీఐ(ఎంఎల్) న్యూడెమొక్రసీ పార్టీ కేంద్ర కమిటీ పిలుపులో భాగంగా జరిపారు. బదుగువానిలంక గ్రామానికి చెందిన తూలూరి మరియమ్మ, దానం విజయలకు నివాళులర్పించి నినాదాలు చేస్తూ ర్యాలీ చేశారు. జిల్లా రైతుకూలీ సంఘం నాయకుడు సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏకాదశ రుద్రాభిషేకం

కపిలేశ్వరపురం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని వల్లూరులోనున్న పార్వతీ అగస్తేశ్వరస్వామి ఆలయంలో కార్తీకమాసాన్ని పురస్కరించుకుని బుధవారం ఏకాదశ రుద్రాభిషేకం జరిపారు. శ్రీకంఠం మల్లేశ్వరశర్మ అర్చకత్వంలో ఈనెల 13 వరకు ప్రతీరోజూ స్వామివారికి ఏకాదశ రుద్రాభిషేకం, సాయంత్రం అమ్మవారికి కుంకుమ పూజ జరుగుతుందని ఆలయ కమిటీ తెలిపింది. అలాగే 13న అన్నసమారాధన, సాయంత్రం నందీశ్వరునికి అభిషేకం, రుద్రహోమం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామస్థులతో పాటు అధిక సంఖ్యలో మహిళలు, భక్తులు పాల్గొన్నారు.



స్వామివారికి ఏకాదశ రుద్రాభిషేకం చేస్తున్న దృశ్యం